01ATP05F.qxd:01ATP05F.qxd 06/06/26 11:22 PM Page 1

అనంతపురం/శ్రీ సత్యసాయి వార్త

తెలుగు జాతీయ దినపత్రిక

శనివారం 06 జూన్ 2026 పేజీలు : 04

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత...!

కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి సత్యకుమార్ యాదవ్

మొక్కలు నాటుతున్న మంత్రి సత్య కుమార్ యాదవ్.

ధర్మవరం, జూన్ 05, ప్రభాతవార్త

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ధర్మవరం పట్టణంలోని బస్టాండ్ ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఆరోగ్య శాఖమంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రారంభించారు. నరేంద్ర మోదీ ఇచ్చిన ఏక్ పేడ్ మాకే నామ్ పిలుపును స్ఫూర్తిగా తీసుకొని తన మాతృమూర్తి నాగభాయమ్మ పేరిట మంత్రి మొక్కను నాటారు. ఈ సందర్భంగా మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ.... ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రకృతి, పర్యావరణం మానవ జీవితంలో అత్యంత కీలకమైన భాగాలని మంత్రి పేర్కొన్నారు.ప్రస్తుతం పర్యావరణ సమతుల్యత దెబ్బతినడం వల్ల ప్రపంచవ్యాప్తంగా అనేక ప్రకృతి వైపరీత్యాలు, వాతావరణ సంక్షోభాలు ఏర్పడుతున్నాయని అన్నారు. వాతావరణ మార్పుల ప్రభావం ఆరోగ్యపరంగానే కాకుండా ఆర్థిక రంగంపైనా తీవ్ర ప్రభావం చూపుతోందని పేర్కొన్నారు. చెట్లు వాతావరణ సమతుల్యతను కాపాడటంలో అత్యంత కీలక పాత్ర పోషిస్తాయని చిన్ననాటి నుంచే మనం చదువుకున్నప్పటికీ, ఆధునికీకరణ, అర్బనైజేషన్ పేరుతో చెట్లను విచక్షణారహితంగా తొలగించడం వల్ల నేడు అనేక రకాల ఆరోగ్య సమస్యలు, శ్వాసకోశ సంబంధిత వ్యాధులు, అకాల వర్షాలు, కరువు పరిస్థితులు ఏర్పడుతున్నాయని మంత్రి అన్నారు. ప్రకృతిని రక్షించుకోవాలంటే చెట్లను నాటడం, వాటిని సంరక్షించడం తప్పనిసరి అని తెలిపారు. తల్లి మన జీవితంలో ఎంత పవిత్రమైనదో, చెట్టు కూడా అంతే పవిత్రమైనదని పేర్కొంటూ, ప్రజల భావోద్వేగాలకు దగ్గరగా ఉండేలా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఏక్ పేడ్ మాకే నామ్ కార్యక్రమాన్ని తీసుకొచ్చారని చెప్పారు. ప్రభుత్వంతో పాటు సామాజిక సంస్థలు, ప్రజలు కూడా భాగస్వాములై తమ ఇళ్లలో, కార్యాలయాల్లో, పరిసర ప్రాంతాల్లో మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని మంత్రి పిలుపునిచ్చారు.ధర్మవరం నియోజకవర్గంలో ఫారెస్ట్ శాఖతో కలిసి పెద్ద ఎత్తున మొక్కల నాటే కార్యక్రమాన్ని ప్రారంభించామని, కదంబం సహా వివిధ రకాల నీడనిచ్చే, ఫలాలను ఇచ్చే చెట్లను ప్రజలకు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ప్రజలు తమ ఇళ్ల పరిసరాల్లో వాటిని నాటాలని కోరారు. గతంలో ఖాళీగా ఉన్న ప్రాంతాలను గుర్తించి చెత్త, కంప మొక్కలను తొలగించి అనేక ప్రాంతాల్లో పార్కుల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో కూడా ప్రజలను భాగస్వాములుగా చేసుకొని మొక్కల నాటే కార్యక్రమాలు కొనసాగుతున్నాయని చెప్పారు. రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రులన్నింటిలోనూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని ఇప్పటికే అధికారులకు ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని మొక్కల పెంపకానికి అనుకూల వాతావరణాన్ని వినియోగించుకునే చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. అలాగే ప్రస్తుత అంతర్జాతీయ పరిస్థితుల నేపథ్యంలో ఇంధన ధరలపై ప్రభావం పడుతున్న సమయంలో ఇంధన పొదుపు చర్యలు కూడా అవసరమని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణతో పాటు ఇంధన వినియోగాన్ని తగ్గించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సైకిల్ ప్రయాణానికి ప్రాధాన్యం ఇస్తున్నారని, అందరూ అలాంటి అలవాట్లను ప్రోత్సహించాలని కోరారు. ఇదే సమయంలో ఆరోగ్య పరిరక్షణలో భాగంగా యోగాంధ్ర కార్యక్రమాలను రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. జూన్ 7 నుంచి 21వ తేదీ వరకు ప్రత్యేక యోగా కార్యక్రమాలు నిర్వహించబడతాయని పేర్కొన్నారు. పోలీసులు, వైద్యులు, అంగన్‌వాడీ సిబ్బంది, రైతులు, మత్స్యకారులు తదితర వర్గాల వారీగా ప్రత్యేక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు.

వైసీపీలో అంతర్యుద్ధం మొదలైందా..?

- పార్టీ నిరసన కార్యక్రమంలో బహిర్గతమైన అంతర్గత విభేదాలు - వీరా గో బ్యాక్ అంటూ నినాదాలతో హోరెత్తించిన వైవీఆర్ వర్గం - ఇది ప్రభుత్వంపై నిరసనా.. లేక వీరాపై నిరసనా.. - ఇలా అయితే గుంతకల్లు గడ్డపై వైసీపీ జెండా ఎగరటం కష్టమేనంటూ పెదవి విరుస్తున్న సీనియర్లు

వీరా గో బ్యాక్ అంటూ రోడ్డుపై నినాదాలు చేస్తున్న వైవీఆర్ వర్గం శ్రేణులు, వైఎస్ఆర్ విగ్రహం ముందు అనుచరులతో వీరా

పామిడి, జూన్ 05 ప్రభాతవార్త

వైసీపీలో వైవీఆర్ పామిడి వీరా వర్గాల మధ్య అంతర్యుద్ధం మొదలైందా.. అన్న సందేహాలు తలెత్తుతున్నాయి. పామిడి వైఎస్ఆర్ విగ్రహం వద్ద శుక్రవారం జరిగిన 'వెన్నుపోటుకు రెండేళ్ళు' కార్యక్రమంలో పాల్గొనేందుకు తన అనుచరులతో వచ్చిన ఏడిసిసి బ్యాంకు మాజీ చైర్మెన్ పామిడి వీరాంజనేయులును నియోజకవర్గ సమన్వయకర్త మాజీ ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి కుమార్తె గుంతకల్లు మున్సిఫల్ మాజీ చైర్‌పర్సన్, జిల్లా ఉపాధ్యక్షురాలు నైరుతీరెడ్డి సమక్షంలో ఆవర్గం శ్రేణులంతా రోడ్డుపైకి చేరుకుని వీరా గో బ్యాక్.. పార్టీకి వెన్నుపోటు పొడిచిన వీరాను సస్పెండ్ చేయాలంటూ నినాదాలతో హోరెత్తించటంతో వర్గాల మధ్య అంతర్గత విభేదాలు ఒక్కసారిగా బగ్గుమవ్వటమే అందుకు నిదర్శనం. అయితే ఇది ప్రభుత్వంపై నిరసన కార్యక్రమంలా లేదని కేవలం వీరాపై నిరసన తెలిపే కార్యక్రమంలా మారిపోయిందని అక్కడున్న ప్రజలు చర్చించుకుంటుండటం గమనార్హం. నాయకుల మధ్య విభేదాలు ఉంటే అందుకు మరో వేదికను చూసుకోవాలే తప్ప ప్రభుత్వంపై పార్టీ నిరసన తెలిపే కార్యక్రమంలో ఇదేమి వింతపోకడ అంటూ పెదవి విరుస్తుండటం చర్చానీయాంశంగా మారింది. నాయకుల మధ్య ఇలానే అంతర్గత కుమ్ములాటలు కొనసాగితే భవిష్యత్తులో గుంతకల్లు గడ్డపై వైసీపీ జెండా ఎగరటం కష్టమే అని నిరసన కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఆపార్టీ సీనియర్లు సైతం వాఖ్యానిస్తుండటం కొసమెరుపు. రాష్ట్రంలో రెండేళ్ళుగా 'వెన్నుపోటు పాలన' కొనసాగుతోందని కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా గళం విప్పాలని వైసీపీ అధినాయకత్వం ఆదేశించగా ఇక్కడేమో ఆపార్టీ నాయకుల వెన్నుపోట్లపైనే శ్రేణులంతా ఎక్కువగా ఫోకస్ పెట్టి రోడ్డెక్కి మరీ నినదించటం వారి పరువును వారే తీసుకున్నట్లైందన్నది పలువురి వాధన. అనంతరం గుంతకల్లు మాజీ మున్సిఫల్ చైర్‌పర్సన్ నైరుతీరెడ్డి వారి అనుచరులతో కలిసి వైఎస్ఆర్ విగ్రహానికి నివాళులు అర్పించగా ఏడిసిసి మాజీ చైర్మెన్ పామిడి వీరాంజనేయులు తన అనుచరులతో కలిసి వైఎస్ఆర్ విగ్రహం కింద నిలుచుని కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేయటం గమనించదగ్గ విషయం.

ఎన్నికల హామీను గాలికొదిలిన ఎన్డీఏ పాలకులు

ఎన్నికల్లో ఇచ్చిన హామీలను గాలికొదిలిన ఎన్డీఏ కూటమి పాలకులు ప్రజావ్యతరేక విధానాలను అవలంభిస్తూ దోచుకోవటం దాచుకోవటం సిద్ధాంతంతో ముందుకెళ్తున్నారని వైసీపీ జిల్లా ఉపాధ్యక్షురాలు, గుంతకల్లు మున్సిఫల్ మాజీ చైర్‌పర్సన్ నైరుతీరెడ్డి ధ్వజమెత్తారు. టిడిపి మేనిఫెస్టో, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ పేర్లతో ఇచ్చన హామీల బాండ్లను ఇదేమి రాజ్యం ఇదేమి రాజ్యం దొంగల రాజ్యం దొంగల రాజ్యం అంటూ వైసీపీ శ్రేణులు పెద్దఎత్తున నినాదాలు చేస్తూ దహనం చేశారు. ఈసందర్భంగా నైరుతీరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారాన్ని చేపట్టినప్పటి నుండి డైవర్షన్ రాజకీయాలు చేస్తూ ప్రచార ఆర్భాటాలతో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తూనే అటు వైసీపీ ఇటు జగన్మోహన్‌రెడ్డిపై వ్యక్తిగత విమర్శలకు దిగుతుండటం దయ్యాలు వేదాలు వల్లించినట్లుందని ఎద్దేవ చేశారు. రెండేళ్ళ కూటమి పాలనలో అవినీతి ఆక్రమాలు దందాలు దౌర్జన్యాలు కుట్రలు కుతంత్రాలు అధికం అయ్యాయని సంక్షేమ పథకాల్లో కోత విధిస్తూ అప్పులమోత మోగిస్తూ రాష్ట్రాన్ని అందకారంలోకి నెడుతోందని ఆరోపించారు. ఎన్నికల హామీలను నెరవేర్చటంలో మిగతా 4 లో....

స్ట్రాబ్ థీమ్ పార్క్ ఆలోచన భేష్

- రైజింగ్ హిందూపురం కలసి రండి - జిల్లాలో కోటి మొక్కలు నాటేల ప్రణాళిక

విద్యార్థులతో కలిసి పెయింటింగ్ చేస్తున్న కలెక్టర్ ,పార్కులో కలెక్టర్ శ్యాం ప్రసాద్, డాక్టర్ సురేంద్ర

హిందూపురం జూన్ 5 ప్రభాతవార్త

నిరుపయోగంగా ఉండే స్ట్రాప్ వస్తువులతో రూపొందించిన థీమ్ పార్క్ ఆలోచన వినూత్నమని జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున ను ప్రశంసించారు. పట్టణంలోని చౌడేశ్వరి కాలనీలో మున్సిపల్ రిజర్వ్ జాగాలో ఈ పార్కు నిర్మాణానికి కమిషనర్ చొరవ తీసుకోవడం, మట్టుపక్కల ప్రజలను కూడా భాగస్వామ్యంగా చేయడం ఎంతో అభినందనీయమని ప్రశంసించారు. శుక్రవారం ఉదయం పార్క్ ను కలెక్టర్ పరిశీలించారు. ఎమ్మెల్యే వ్యక్తిగత కార్యదర్శి డాక్టర్ సురేంద్ర బాబు, వీరయ్య, బాలాజీ కలెక్టర్ తో పాటు పాల్గొన్నారు. విద్యార్థులతో కలిసి పార్కు ప్రహరీ గోడకు స్వయంగా కలెక్టర్ పెయింటింగులు వేసి ప్రోత్సహించారు. గోడలకు పెయింటింగ్ చేస్తున్న విద్యార్థులతో ఆప్యాయంగా మాట్లాడుతూ వారి కోరిక మేరకు ఫోటోలు కూడా దిగారు. తదుపరి సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు పెయింటింగ్ లో స్వచ్ఛందంగా పాల్గొనడం అభినందనీయం అన్నారు. పెయింటింగ్ లు వేసిన విద్యార్థులకు ప్రశంస పత్రాలను పంపిణీ చేశారు. వారి విజ్ఞప్తుల మేరకు పిల్లలతో కలిసి కలెక్టర్ ఫోటోలు దిగారు. తదుపరి మొక్కలు నాటారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ స్వచ్ఛ హరిత హిందూపురం.. రైసింగ్ హిందూపురం కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే బాలకృష్ణ స్ఫూర్తితో ఇక్కడ ఎకో పార్క్ ఏర్పాటు అవుతుందని ప్రకృతి సంపదను, పర్యావరణాన్ని రక్షించుకునేందుకు ప్రజల్లో చైతన్యం తెచ్చేలా దోహదం చేస్తుందన్నారు. గాంధీ జయంతి అక్టోబర్ రెండో తేదీ లోపు పెద్ద ఎత్తున మొక్కలు నాటే ప్రక్రియ చేపట్టుతున్నామని సత్యసాయి జిల్లాలో కోటి, హిందూపురం నియోజకవర్గం లో కనీసం 20 లక్షల మొక్కలను నాటేలా ప్లాన్ చేస్తున్నామన్నారు. ప్రజలు ప్రతి ఒక్కరూ మొక్కలను నాటి దత్తత తీసుకోవాలని తద్వారా రైజింగ్ హిందూపురంలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు వెంకటేష్, అమర్నాథ్, రాఘవేంద్ర, చంద్రమోహన్, ఎర్రగడ్డ పవన్ కుమార్, భార్గవ్, అయూబ్ మొదలవారు పాల్గొన్నారు.

సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్న వెనిజులా దేశ అధ్యక్షురాలు

పుట్టపర్తి రూరల్ మే 5 ప్రభాతవార్త:

సత్యసాయిబాబా మహాసమాధిని వెనిజులా దేశఅధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్ శుక్రవారం సాయంత్రం దర్శించుకున్నారు. భారత్ పర్యటనలో భాగంగా బుధవారం ఢిల్లీకి చేరుకున్న వెనిజులా తాత్కాలిక అధ్యక్షురాలు డెల్సీ రోడ్రిగ్జ్ ప్రశాంతి నిలయానికి విచ్చేసి సత్యసాయి మహా సందర్శించారు. ఢిల్లీ నుండి ప్రత్యేక విమానంలో పుట్టపర్తి విమానాశ్రయం కు చేరుకొని అక్కడి నుండి ప్రశాంతి నిలయానికి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమెకు ట్రస్ట్ వర్గాలు ఘనంగా స్వాగతం పలికాయి. సత్యసాయి ఆధ్యాత్మిక బోధనలతో ప్రభావితమైన ఆమె సత్యసాయి భక్తురాలిగా 2023 ఆగస్టు మరియు 2024 అక్టోబర్ లో కూడా సత్యసాయి మహా సమాధిని దర్శించుకున్నారు. వెనిజులా మాజీ అధ్యక్షుడు నికోలాస్ మధురో కూడా సత్యసాయి భక్తునిగా 1970 లో సత్యసాయిని దర్శించుకున్నట్లు ట్రస్ట్ వర్గాలు తెలిపాయి.

పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత -ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి

స్వచ్ఛ హరిత పుట్టపర్తిగా మారుద్దాం పర్యావరణాన్ని కాపాడుకుందాం

ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్, ఎస్పీ, మాజీ మంత్రి పల్లె

పుట్టపర్తి టౌన్, జూన్ 05, ప్రభాతవార్త

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పుట్టపర్తి ఎద్దులకొండలో అటవీ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన మొక్కలు నాటే కార్యక్రమంలో పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్, జిల్లా ఎస్పీ సతీష్ కుమార్, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి అటవీ శాఖ అధికారులు, పర్యావరణ ప్రేమికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. మొక్కలు నాటడం మాత్రమే కాకుండా వాటిని సంరక్షించడం కూడా మన కర్తవ్యమని పేర్కొన్నారు. స్వచ్ఛమైన, హరితమైన పుట్టపర్తి నిర్మాణానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి స్వచ్ఛ హరిత పుట్టపర్తిగా మారుద్దామని పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ భూతాన్ని అంతం చేద్దామని కోరారు. కాలుష్యాన్ని నివారించి పచ్చదనాన్ని పెంపొందించాలని కోరారు. మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ, పర్యావరణ సమతుల్యత కోసం విస్తృతంగా మొక్కలు నాటాల్సిన అవసరం ఉందన్నారు. భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించాలంటే పర్యావరణ పరిరక్షణకు అందరూ కట్టుబడి ఉండాలని సూచించారు. జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. కోటి మొక్కల నాటే కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే, మాజీ మంత్రి, జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, అధికారులు మరియు పర్యావరణ ప్రేమికులు కలిసి "స్వచ్ఛ హరిత ఆంధ్రప్రదేశ్" సాధనకు కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి సంరక్షించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవీ శాఖ అధికారి చక్రపాణి, సోషల్ ఫారెస్ట్ అధికారి శ్రీనివాసులు, పుట్టపర్తి ఆర్డీవో సువర్ణ, డిఆర్డిఏ వెలుగు పీడి నరసయ్య, డ్రామా పీడీ ప్రసాద్, కూటమి పార్టీల నాయకులు శ్రీనివాసులు, సోమకోటి ఆదినారాయణ, రామారావు, గంగాధర్ నాయుడు, జయప్రకాష్, కృష్ణప్రసాద్, బేకరీ నాయుడు, సురేష్ చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలు యువతలో స్ఫూర్తిని పెంపొందిస్తాయి- ఎమ్మెల్యే కాలవ

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలవ , విన్నర్ జట్టుకు ఎన్టీఆర్ ట్రోఫీ అందజేస్తున్న ఎమ్మెల్యే కాలవ

డి.హిరెహాళ్ జూన్ 5 ప్రభాతవార్త

కాలవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కేసీఎల్3 క్రికెట్ పోటీలు యువతలో క్రీడాస్ఫూర్తిని, స్నేహభావాన్ని పెంపొందిస్తున్నాయని ప్రభుత్వ విప్, తెదేపా పొలిట్ బ్యూరో సభ్యులు, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం డి.హిరెహాళ్ మండలం సోమలాపురం గ్రామంలో కేసీఎల్ ఫౌండేషన్ చైర్మన్ కాలవ భరత్ సహకారంతో నిర్వహించిన ఎన్టీఆర్ ట్రోఫీ కేసీఎల్ 3 ఫైనల్ క్రికెట్ మ్యాచ్ పోటీకి ఎమ్మెల్యే కాలవ ముఖ్యఅతిథిగా హాజరై గెలుపొందిన విన్నర్స్, రన్నర్స్ జట్లకు టోపీ, నగదు బహుమతి అందజేశారు. ఈ సందర్భంగా ప్లే గ్రౌండ్లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు, ఆంధ్రప్రదేశ్‌కు తొలి కాంగ్రెస్సేతర ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావు జయంతి సందర్భంగా ఆయన పేరుపై ప్రతి ఏటా కాలవ ఫౌండేషన్ చైర్మన్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ ట్రోఫీని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ టోర్నమెంటులో ఫైనల్ మ్యాచ్ లో గెలుపొందిన సోమలాపురం, కల్యం జట్ల మధ్య జరిగిన పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా మే 28న ప్రారంభమైన ఈ పోటీల్లో యువకులు ఎంతో ఉత్సాహంగా పాల్గొంటుండడం ఎంతో ఆనందదాయకమన్నారు. డీ.హీరేహాల్ మండల వ్యాప్తంగా 28 జట్లు పాల్గొనగా కల్యం, సోమలాపురం జట్లు నేడు మండల స్థాయి పోటీలో తలపడినట్లు తెలిపారు. ఉత్కంఠ భరితంగా సాగిన ఈ పోటీలో సోమలాపురం జట్టు విజేతగా నిలిచిందని, విజేతలతో పాటు రన్నరప్ జట్టుకు కూడా అభినందనలు తెలిపారు. గెలుపొందిన జట్టుకు ఎన్టీఆర్ ట్రోఫీ తో పాటు రూ.20 వేల నగదు, రన్నర్ గా నిలిచిన జట్టుకు రన్నర్ ట్రోఫీతో పాటు రూ.10 వేల నగదు అందజేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న క్రీడాకారుల ప్రతిభ గ్రామ స్థాయికే పరిమితం కాకుండా నియోజకవర్గ స్థాయిలో గుర్తింపు పొందాలనే లక్ష్యంతో ఈ పోటీలను నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదిగేందుకు అవసరమైన అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తామని ఎమ్మెల్యే కాలవ చెప్పారు. మండల స్థాయిలో ఎంపికైన ఆరు జట్ల మధ్య రాయదుర్గంలో తుది పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. ఆ పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు, జట్లకు ప్రత్యేక ట్రోఫీలు అందజేయనున్నట్లు వెల్లడించారు. ఈ తరహా క్రీడా పోటీలు యువత మధ్య స్నేహపూర్వక వాతావరణాన్ని పెంపొందించడంతో పాటు గ్రామీణ క్రీడాకారులకు గుర్తింపు తీసుకువస్తాయన్నారు. యువతకు ఇలాంటి అవకాశాలు మరింత ఎక్కువగా కల్పిస్తే వారు జీవితంలో ఎదగడానికి అవకాశం ఉంటుందన్నారు. గత రెండేళ్లుగా కాలవ ఫౌండేషన్ చైర్మన్ కాలవ భరత్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించబడుతున్నాయని, ఈ ఏడాది వరుసగా మూడోసారి పోటీలను నిర్వహించడం అభినందనీయమని కొనియాడారు. ఎన్టీఆర్ ట్రోఫీ తనదేనన్న ఉత్సాహంతో ఈ పోటీల్లో అనేక మంది క్రీడాకారులు పాల్గొంటుండటం సంతోషకరమన్నారు. రాయదుర్గం ప్రాంత యువతకు తమ ప్రతిభను చాటుకునే వీలుగా భవిష్యత్తులో ఇలాంటి క్రీడా పోటీలు మరింత విస్తృతంగా నిర్వహించాల్సిన అవసరం ఉందని ఎమ్మెల్యే కాలవ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ కాదలూరు మోహన్ రెడ్డి, మార్కెట్ యార్డ్ చైర్మన్ యు.హనుమంత రెడ్డి , ఎంపిటిసి మల్లికార్జున, మార్కెట్ యార్డ్ మాజీ వైస్ చైర్మన్ రామంజనేయులు, తెదేపా మాజీ మండల కన్వీనర్ అంగడి రాజశేఖర్, తెదేపా నాయకులు కురుబ శంకర్, శ్రీరాములు, హేమారెడ్డి, మల్లికార్జునరెడ్డి, మల్లికార్జున గౌడ్, భీమరెడ్డి, గుద్దం బసవరాజు, వన్నూరుస్వామి, గోవిందు, శ్రీనివాసులు, బోయపాటి రాజు, రాము, బించె బసప్ప, మరిస్వామి, శివరాం, బసిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రన్నర్ జట్టుకు టోపీ అందజేస్తున్న ఎమ్మెల్యే కాలువ

ప్రకృతి పరిరక్షణ సామాజిక బాధ్యత

ప్రపంచ పర్యావరణ దినోత్సవ కార్యక్రమంలో భాగంగా సైకిల్ తొక్కిన జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్, అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్

పర్యావరణ దినోత్సవ సందర్భంగా సైకిల్ తొక్కిన జిల్లా కలెక్టర్ , పర్యావరణ దినోత్సవ సందర్భంగా ర్యాలీని ప్రారంభించిన ఎమ్మెల్యే దగ్గుబాటి

అనంతపురం కలెక్టరేట్ జూన్ 05 ప్రభాతవార్త

సమాజంలోని ప్రతిఒక్కరూ ప్రకృతి, పర్యావరణ పరిరక్షణ సామాజిక బాధ్యతగా గుర్తించాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ మరియు అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవంలో భాగంగా శుక్రవారం నగరంలోని అనంతపురం కలెక్టరేట్ నుంచి ఉప్పరపల్లిలోని యాక్సియన్ ఫ్రాటర్నా ఎకాలజీ సెంటర్ వరకు నిర్వహించిన అవగాహన ర్యాలీని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్,ఎమ్మెల్యేదగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ ప్రారంభించారు. ముందుగా ప్రజలకు ప్రపంచ పర్యావరణ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యేతో కలిసి జిల్లా కలెక్టర్ కొంత దూరం వరకు ఈ సైకిల్ ను తొక్కారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మొక్కలను పెంచి పచ్చదనాన్ని పంచే కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగానే కాకుండా వ్యక్తిగత బాధ్యతగా స్వీకరించాలని ప్రజలకు పిలుపునిచ్చారు.. శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా 2.5 కోట్ల విత్తనబంతులు, అలాగే మన జిల్లాలో 13 లక్షల విత్తన బంతులు, 1 కోటి మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టే దిశగా సమాయత్తమవుతున్నట్లుతెలిపారు. ప్రజలుఆరోగ్యవంతమైన వాతావరణంలోఉండాలని, పర్యావరణానికి పెనుముప్పుగా మారిన కాలుష్యం తదితర లాంటి వాటిపై అవగాహనను కలిగిఉండాలన్నారు. ఈ సందర్భంగా పర్యావరణంపై అవగాహన ర్యాలీలో పాల్గొన్న అనంతపురం అర్బన్ఎమ్మెల్యేదగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ మాట్లాడుతూ సమాజంలోని ప్రతి ఒక్కరు పర్యావరణ పరిరక్షణ కోసం ముందుకు రావాలనిపిలుపునిచ్చారు.కనీసంవారంలో ఒకరోజైనా ఇంధన వాహనాల ను పక్కనపెట్టి ఇంధన పొదుపు పర్యావరణ కోసం కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సామాజిక వన విభాగం జిల్లా అధికారి గురు ప్రభాకర్, జిల్లా పర్యావరణ కాలుష్య నియంత్రణ శాఖ అధికారి శశికళ, డిఆర్డిఏ ప్రాజెక్టు డైరెక్టర్ శైలజ, వ్యవసాయ శాఖ అధికారి సాలు రెడ్డి, ఆర్డిటి ఏఎఫ్ ఎకాలజీ డైరెక్టర్ మల్లారెడ్డి, ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్స్ దీవ, శివరాం, వివిధ శాఖల అధికారులు, పలువురు రైతులు, విద్యార్థులు, స్వచ్ఛంద సేవా సంస్థలు, కిమ్స్ హాస్పిటల్ నర్సింగ్ విద్యార్థులు, జిందాల్ సంస్థ ప్రతినిధులు ఉద్యోగులు, తదితరులు పెద్ద ఎత్తున అవగాహన ర్యాలీలో పాల్గొన్నారు.

ఎస్ కోనాపురంలో జలధార జలహారతి

బ్రహ్మసముద్రం ఎంపీడీఓ, కూటమి నాయకుల ఆధ్వర్యంలో ప్రారంభించిన మండల కన్వీనర్ పాలబండ్ల శ్రీరాములు

జలధార జల హారతి కార్యక్రమం ను ప్రారంభిస్తున్న దృశ్యం

బ్రమ్మసముద్రం జూన్ 5 ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో జలవనరుల పరిరక్షణ, అభివృద్ధి సాగునీటి సమర్థవంతమైన వినియోగం కోసం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన "జలధార - జలహారతి" కార్యక్రమం బ్రమ్మసముద్రం మండలం ఎస్. కోనాపురం గ్రామంలో ప్రారంభించారు కళ్యాణదుర్గం నియోజకవర్గ ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు పర్యవేక్షణలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులో భాగంగా తెలుగుదేశం పార్టీ బ్రమ్మసముద్రం మండల కన్వీనర్ పాలబండ్ల శ్రీరాములు ఎంపీడీఓ ఏకాంబేశ్వర డిప్యూటీ ఎంపీడీఓ యోగేష్, మాజీ సర్పంచ్ మల్లెల వనిత మల్లికార్జున ప్రారంభించారు. భవిష్యత్తు తరాలకు జల రక్షణ ఈ సందర్భంగా టీడీపీ మండల కన్వీనర్ పాలబండ్ల శ్రీరాములు మాట్లాడుతూ వర్షపు నీటిని ఒడిసిపట్టడం, చెరువులలో పూడికతీత పనులు చేపట్టడం అంతరించిపోతున్న జల వనరులకు పూర్వవైభవం తీసుకురావడమే కూటమి ప్రభుత్వ ముఖ్య సంకల్పమని అన్నారు. కళ్యాణదుర్గం నియోజకవర్గంలో ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు స్వయంగా క్షేత్రస్థాయిలో ఈ "జలధార, జలహారతి" కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తూ, నియోజకవర్గాన్ని సుభిక్షం చేసేందుకు అహర్నిశలు శ్రమిస్తున్నారని కొనియాడారు. భూగర్భ జలాలు పెరిగి రైతాంగానికి మేలు జరగాలన్నదే ఈ కార్యక్రమ ఉద్దేశమన్నారు. చెరువు మట్టిని స్వచ్ఛందంగా రైతులు తరలించుకుని భూములను సారవంతం చేసుకోవాలని అన్నారు ఈ కార్యక్రమంలో మండల పరిధిలోని ప్రభుత్వ అధికారులు, కూటమి ముఖ్య నాయకులు, కార్యకర్తలు మరియు ఎస్. కోనాపురం గ్రామ ప్రజలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని దిగ్విజయం చేశారు.

పీర్ల పండుగ మనదే పర్యావరణ పరిరక్షణ మనదే

మండల అధికారులకు వినతి జనసేన, భారతీయ జనతాపార్టీ

బెలుగుప్ప, జూన్ 5 ప్రభాతవార్త

వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

జూన్ 26న నిర్వహించే మతసామరస్యాల ప్రతీక పీర్ల పండుగ ప్రజలు సంప్రదాయ బద్ధ ఆచారంతో సంతోషంగా జరుపుకోవాలని, అలాగే పర్యావరణ పరిరక్షణకు సైతం కృషి చేయాలని మండల బి.జె.పి. జనసేన పార్టీల నాయకులు పేర్కొన్నారు. పీర్ల పండగ హిందువులు, ముస్లింలు కలిసి జరుపుకుంటారు. అయితే పీర్ల పండుగ ఆచారం ప్రకారం అగ్నిగుండం నిర్వహించడం జరుగుతుంది. అయితే ఈ పీర్ల పండుగ సందర్భంగా అగ్నిగుండంలోకి పచ్చని చెట్లను నరికి వేయకుండా పనికిరాని చెట్లను, రోడ్లకు అడ్డంగా ఉన్న చెట్లను, పిచ్చి మొక్కలను నరికే విధంగా చూడాలని, వాటినే అగ్నిగుండంలో వేసే విధంగా తగు చర్యలను మండల వ్యాప్తంగా తీసుకోవాలని కోరారు. పచ్చని చెట్లు నరకడం వలన పచ్చదనము తగ్గి భూగర్భ జలాలు తగ్గిపోయి రైతులకు సకాలంలో వర్షాలు రాక నష్టపోవడం వంటివి కూడా జరుగుతుందని తెలియజేస్తూ, మండల ప్రజలు ప్రతి ఒక్కరూ కూడా సంప్రదాయబద్ధంగా పండగ నిర్వహించే విధంగా చూడాలని, పండగ మనము ఎంత సంతోషంతో, బాధ్యతగా జరుపుకుంటాము. అలాగే పర్యావరణాలను సంరక్షించుకునే బాధ్యత కూడా మనదే అని, మండల ప్రజలకు తెలియజేయాలని ప్రజలలో పర్యావరణ బాధ్యతను గుర్తుచేసి ప్రజలలో చైతన్యం తీసుకురావాలని మండల అధికారులైన తహసీల్దార్ అనిల్ కుమార్, ఎం.పి.డి.ఓ లక్ష్మీనారాయణ, ఏ.ఎస్సై రామదాసుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షుడు కాశంశెట్టి సుధీర్, భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షులు పూజారి మధు, బిజెపి నాయకులు వన్నూరుస్వామి, వెంకటేశ్, జనసేన నాయకులు తిప్పేస్వామి, అభి తదితరులు పాల్గొన్నారు.

నవచేతన యాప్‌పై అంగన్వాడీ కార్యకర్తలకు శిక్షణ

కంబదూరు, జూన్ 5, ప్రభాత వార్త

కార్యక్రమంలో మాట్లాడుతున్న సూపర్ వైజర్ పద్మజ

కంబదూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అంగన్వాడీ కార్యకర్తలకు నవచేతన యాప్ వినియోగం, చిన్నారుల ఆరోగ్య పరీక్షల నిర్వహణపై ఐసీడీఎస్ అధికారులు సిడిపిఓ భారతి సూచనల మేరకు శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సూపర్‌వైజర్ పద్మజ మాట్లాడుతూ, పుట్టుకతో చిన్నారులకు వచ్చే వ్యాధులు, వైకల్యాలను ముందుగానే గుర్తించేందుకు ఆరోగ్య పరీక్షలను శాస్త్రీయ పద్ధతుల్లో నిర్వహించాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాల పరిధిలో ఉన్న ఆరేళ్లలోపు ప్రతి చిన్నారిని తప్పనిసరిగా స్క్రీనింగ్ చేసి, అవసరమైన వారిని సంబంధిత ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల వైద్యులకు సిఫార్సు చేయాలని తెలిపారు. స్క్రీనింగ్ ద్వారా గుర్తించిన లోపాలను వైద్యులు పరిశీలించి, తగినసమయంలో అవసరమైన వైద్యం అందించేందుకు చర్యలు చేపడతారని పేర్కొన్నారు. నవచేతన యాప్ ద్వారా చిన్నారుల ఆరోగ్య వివరాలను నమోదు చేయడం, పర్యవేక్షించడం మరింత సులభమవుతుందని వివరించారు. శిక్షణలో ఆరోగ్య పరీక్షల విధానం, డేటా నమోదు, చిన్నారుల అభివృద్ధి పర్యవేక్షణకు సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది లీలావతి, ఐసీడీఎస్ సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీ సత్యసాయి సేవాసదన్ ను సందర్శించిన డాక్టర్ శ్రీనివాస మూర్తి

గుడిబండ జూన్ 5 ప్రభాతవార్త

బాలలతో మాట్లాడుతున్న శ్రీనివాసమూర్తి

హిందూపురంలోని బాలికా సదన్, శ్రీసత్యసాయి సేవాసదన్ అనాథాశ్రమాన్ని రాష్ట్ర బాలల పరిరక్షణ కమిషన్ సభ్యులు డాక్టర్ శ్రీనివాసమూర్తి సిడిపిఓ ఇతర అధికారులతో కలిసి సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల భద్రత, పరిశుభ్రత, విద్య, ఆరోగ్య సదుపాయాలు, పోషకాహారం, భావోద్వేగ సంక్షేమంపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. చిన్నారులతో నేరుగామాట్లాడి వారిఅభిప్రాయాలు, ఆశయాలు తెలుసుకున్నారు. ప్రతిచిన్నారి భయరహితంగా, గౌరవంతో, ఆత్మవిశ్వాసంతో ఎదగాలని, పిల్లలకు ప్రేమ, రక్షణ, నాణ్యమైన విద్య, భవిష్యత్తుపై నమ్మకం కల్పించడం మన అందరి బాధ్యత అని అన్నారు. బాలల హక్కుల పరిరక్షణలో రాష్ట్ర బాలల పరిరక్షణ కమిషన్ తరుపున నిరంతరం పనిచేస్తామని తెలిపారు.

ప్రపంచ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేద్దాం

- జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్

ఈ సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

లేపాక్షి, జూన్ 5 ప్రభాతవార్త

లేపాక్షి ఆలయ ప్రాంగణంలో స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ శ్యాంప్రసాద్

మండల కేంద్రమైన లేపాక్షిలో ఈనెల 21న నిర్వహించే ప్రపంచ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేద్దామని జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ పిలుపునిచ్చారు. స్థానిక వెలుగు కార్యాలయంలో శుక్రవారం తహశీల్దార్ సౌజన్యలక్ష్మి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రపంచ యోగా దినోత్సవం ఏర్పాట్లపై చర్చించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రత్యేక అధికారి చక్రపాణి మాట్లాడుతూ పర్యాటక క్షేత్రంగా పేరొందిన లేపాక్షిలో ఈనెల 7వతేదీ నుండి 21వ తేదీ వరకు యోగ శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుందన్నారు. అందుకు అవసరమైన ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. టూరిజం శాఖ జిల్లా అధికారి నరసయ్య మాట్లాడుతూ లేపాక్షి మండల పరిధిలోని సచివాలయ సిబ్బంది, జవహర్ నవోదయ విద్యాలయం, ఎంజెపి గురుకుల పాఠశాల విద్యార్థులను, స్థానికులను యోగ శిక్షణకు వచ్చే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ శ్రీనివాస్, ఎంఈఓ నాగరాజు, పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ వెంకటచిరంజీవి, హిందూపురం రూరల్ సిఐ జనార్ధన్, లేపాక్షి ఎస్ఐ నరేంద్ర, ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ సాహితీ, యోగ శిక్షకులు శ్రీనివాసరెడ్డి, మండల స్థాయి అధికారులు, కార్యదర్శులు, విఆర్ఒలు పాల్గొన్నారు.

యోగా శిక్షణా తరగతులకు స్థల పరిశీలన చేసిన కలెక్టర్ : ఈనెల 7 నుండి 21 వరకు నిర్వహించనున్న యోగ శిక్షణ తరగతుల కోసం మండల స్థాయి అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ లేపాక్షి ఆలయ పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రపంచ యోగా దినోత్సవాన్ని ఈనెల 21న ఘనంగా నిర్వహించాలన్నారు. అధిక సంఖ్యలో యోగ శిక్షణలో పాల్గొనే విధంగా స్థానిక అధికారులు కృషి చేయాలన్నారు. ఆలయంలోనే యోగా శిక్షణా తరగతులు నిర్వహించే విధంగా అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం

చిలమత్తూరు, జూన్ 5 ప్రభాతవార్త

మొక్కలు నాటుతున్న దృశ్యాలు

ప్రపంచ పర్యావరణం దినోత్సవం సందర్భంగా శుక్రవారం చిలమత్తూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఆవరణంలో సబ్ రిజిస్ట్రార్ ఎం. దామోదరం ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాల మార్కెట్ విలువలు మరియు ఆడిట్ డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్ జి. భార్గవ్ చేతుల మీదుగా మొక్కలు నాటారు.

ఈ సందర్భంగా డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్ భార్గవ్ మాట్లాడుతూ మానవ మనుగడకు అత్యంత అవసరమైన ప్రాణవాయువు అయిన ఆక్సిజన్ మనకు చెట్ల నుండి వస్తుందని, అలాంటి చెట్లను అమానుషంగా, కర్కశంగా నరికి వేయడం జరుగుతోందన్నారు. చెట్లను నరకడం వల్ల వచ్చే అనర్థాలు ఓజోన్ పొర క్షీణిస్తుందన్నారు. కావున ప్రజలు విధిగా ప్రతి ఒక్కరూ ఒక చెట్టుని నాటి ఆ చెట్టుని కాపాడాలన్నారు. మొక్కలు నాటడం వల్ల పర్యావరణ సమస్య తలెత్తకుండా పర్యావరణ అభివృద్ధికి ప్రజలందరూ తోడ్పడాలని ఆయన తెలియజేశారు. ఈ సందర్భంగా చిలమత్తూరు సబ్ రిజిస్ట్రార్ దామోదరం మాట్లాడుతూ చెట్లను నరికి వేయడం వల్ల భూగర్భ జలాలు అడుగంటి నీటి ఎద్దడి ఏర్పడుతుందని అలాగే చెట్లను నరికి వేయడం వలన కలుషితమైన గాలిని పీల్చి ప్రజలు తీవ్ర అనారోగ్యమైన సమస్యలు ఎదుర్కొంటారన్నారు. కావున మొక్కలు పెంచడం వల్ల వాతావరణ కాలుష్యం తగ్గి పర్యావరణ సమతుల్యత వాటిల్లకుండా ఉంటుందని ఆయన తెలియచేశారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి, అనంతపురం జిల్లాల మార్కెట్ విలువలు మరియు ఆడిట్ కార్యాలయ సిబ్బంది సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాసులు, ఫణిశేఖర్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది శ్రీలక్ష్మి, గోవిందరెడ్డి, పర్యావరణ ప్రేమికులు, ప్రజలు పాల్గొన్నారు.

లేపాక్షి పిహెచ్‌సిలో 65 మందికి పౌష్టికాహారం అందజేత

- తన జీవితకాలం మాతృమూర్తులకు పౌష్టికాహారం అందజేస్తా

- రమామణి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు కరణం రామానందన్

గర్భవతులకు భోజనం వడ్డిస్తున్న దృశ్యం

లేపాక్షి, జూన్ 5 ప్రభాతవార్త

కన్నతల్లి ఆశీస్సులతో ప్రతి వారం గర్భవతుల ఆకలి తీర్చే భాగ్యం కలగడం తన పూర్వజన్మ సుకృతమని రమామణి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు కరణం రామానందన్ పేర్కొన్నారు. శుక్రవారం లేపాక్షి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య పరీక్షల నిమిత్తం వచ్చిన గర్భవతులకు ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచితంగా పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రామానందన్ మాట్లాడుతూ తన మాతృమూర్తి జ్ఞాపకార్థం ప్రతి వారం యథావిధిగా ఈ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మాతృమూర్తులైన గర్భవతులకు సేవలందించడాన్ని ఒక అదృష్టంగా భావిస్తున్నానని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం 65 మంది మహిళలకు భోజన వసతి కల్పించారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ వెంకటచిరంజీవి, సిహెచ్ఓ సీతాలక్ష్మి, ఎంపిహెచ్ఈఓ సుబ్రహ్మణ్యం, వైద్య సిబ్బంది, గర్భవతులు, రామానందన్ మిత్రులు, తదితరులు పాల్గొన్నారు. నిరంతరాయంగా సాగుతున్న ట్రస్ట్ సేవా కార్యకలాపాలపై స్థానికులు, లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు.

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

వజ్రకరూరు జూన్ 5 ప్రభాతవార్త : పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒకరు బాధ్యతగా తీసుకొని గ్రామాలలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని శుక్రవారం చేపట్టారు. 1998 10వ తరగతి పూర్వ విద్యార్థులు మండలంలోని వివిధ గ్రామాలలో స్థానిక యువత ఆధ్వర్యంలో పాఠశాలల్లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రస్తుతం వాతావరణం కాలుష్యంగా మారిందన్నారు. వేగంగా విస్తరిస్తున్న నాగరికతతో అడవులు కనుమరుగవుతున్నాయన్నారు. భవిష్యత్తు తరాలకు శుద్ధమైన గాలిని అందించాలన్న, పర్యావరణ కాపాడుకోవాలని ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని వారు పిలుపునిచ్చారు.

రూ.7.50కోట్లతో నిర్మించిన బిటి, సీసీ రోడ్లను ప్రారంభించిన రాప్తాడు ఎమ్మెల్యే సునీత

బీటీ రోడ్డు ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత...

కనగానపల్లి జూన్ 5 ప్రభాతవార్త

మండలంలోని తూముచెర్ల, గుంతపల్లి, సి.ఎన్ కోట గ్రామాలలో 90లక్షలతో నిర్మించిన సిసి రోడ్లను శుక్రవారం రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ప్రారంభించారు. అలాగే కనగానపల్లి, ఆత్మకూరు మండలాల పరిధిలోని తగరకుంట గ్రామం నుంచి వయా తూముచెర్ల సీ.ఎన్.కోట గ్రామాల మీదుగా రంగంపేట క్రాస్ వరకు మొత్తం6.60 కోట్లతో నిర్మించిన బీటీ రోడ్డు, కల్వర్టును ఆమె ప్రారంభించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గ్రామంలో ఆమె సైకిల్ ర్యాలీ నిర్వహించారు. గ్రామంలోని మహిళలతో కలసి సైకిల్ ర్యాలీ నిర్వహించారు. పర్యావరణం కోసం ప్రతి ఒక్కరూ సైకిల్ వినియోగించాలని అవగాహన కల్పిస్తూ ఈ ర్యాలీ సాగింది. అనంతరం ఈ సందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ మా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలోనే 125 కోట్ల రూపాయలతో రోడ్లు వేశామన్నారు. కేవలం ఒక రోడ్ల విషయంలోనే ఇంత ఖర్చు చేసినట్లు ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ యాతం పోతులయ్య, ఎంపీడీవో అనిల్ కుమార్, అధికారులు, టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐఆర్-2026పై జిల్లా స్థాయి శిక్షణ

పుట్టపర్తి(కలెక్టరేట్), జూన్ 05, ప్రభాతవార్త

భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటరు జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం (ఎస్ ఐ ఆర్ - 2026) అమలుకు సంబంధించి జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమం శుక్రవారం పుట్టపర్తిలోని పీజీఆర్ఎస్ హాల్‌లో నిర్వహించారు. ఈ శిక్షణ కార్యక్రమానికి జాయింట్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో) కొండయ్య, పుట్టపర్తి రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీవో) సువర్ణ హాజరై, ఎన్నికల ప్రక్రియలో ఓటరు జాబితాల ప్రాధాన్యత, సవరణ కార్యక్రమం అమలు విధానం, క్షేత్రస్థాయిలో చేపట్టాల్సిన చర్యలపై అధికారులకు అవగాహన కల్పించారు. ఎస్ఐఆర్-2026 కార్యక్రమం ద్వారా అర్హులైన ప్రతి పౌరుడు ఓటరు జాబితాలో నమోదు కావడం, మరణించిన వారు, వలస వెళ్లిన వారు, ద్వంద్వ నమోదులు వంటి అంశాలను గుర్తించి జాబితాలను మరింత ఖచ్చితంగా రూపొందించడం లక్ష్యమని తెలిపారు. అలాగే ఓటరు నమోదు, పేర్ల చేర్పు, తొలగింపు, సవరణలకు సంబంధించిన దరఖాస్తుల పరిశీలన, క్షేత్రస్థాయి ధృవీకరణ, ఫారాల నిర్వహణ, ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాల అమలుపై అధికారులు, సిబ్బందికి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల విభాగ అధికారులు, తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లు, సూపర్‌వైజర్లు, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

బెలుగుప్పలో చంద్రబాబువెన్నపోటుకు రెండేళ్ళు

బెలుగుప్ప, జూన్ 5 ప్రభాతవార్త

రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్సార్ కాంగ్రెసు పార్టీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఉరవకొండ నియోజకవర్గంలో బెలుగుప్ప మండల కేంద్రంలో వైఎస్సార్సీపీ కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా వైఎస్సార్సీపీ అధికార ప్రతినిధి సీపీ వీరన్న మండల కన్వర చిన్న మచ్చున్న హాజరయ్యారు ఈ సందర్భంగా సీపీ వీరన్న మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం 2024సంవత్సరంలో ప్రజలకు ఇచ్చన సూపర్ సిక్స్ హామీలతో పాటు 143హామీల చంద్రబాబు రాష్ట్ర ప్రజలకు హామీలు ఇవ్వడం జరిగింది అయితే ఇచ్చిన హామీలను అమలు చేయకుండా రాష్ట్రంలో ఒక ప్రజా వ్యతిరేక పాలన కొని సాగుతుందని ఇప్పటికైనా ఈ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని రాష్ట్ర ప్రజలకు మేలు జరిగే విధంగా ఈ కూటమి ప్రభుత్వము ప్రభుత్వాన్ని నడపాలన్నారు ఇచ్చిన హామీలను నెరవేర్చనిపక్షంలో రాబోయే రోజుల్లో అన్ని వర్గాల వారిని కలుపుకొని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మరికొన్ని పోరాటాలు చేస్తామని ఈ ప్రభుత్వాన్ని హెచ్చరిస్తూ ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించిన ప్రభుత్వ వైఖరి నిరసనగా వైఎస్సార్ సీపీ శ్రేణులు బెలుగుప్ప మారమ్మ గుడి నుంచి ర్యాలీగా రాజశేఖర్ రెడ్డి సర్కిల్ విగ్రహం వరకు వచ్చి మేనిఫెస్టో ప్రతులు బాండ్ పేపర్ల ను నిప్పంటించి దహనం చేశారు ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు ఎంపీటీసీలు వైసిపి వివిధ అనుబంధ విభాగం జిల్లా తాలూకా మండలం అధ్యక్షులు ఉపాధ్యక్షులు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఇంటికి అమ్మ పర్యావరణానికి మొక్క అవసరం

ఎంపీడీవోవెంకట రంగారావు

తాడిమర్రి జూన్ 5 (ప్రభాత వార్త)

అమ్మ పేరుతో చెట్లను నాటే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

ప్రతి ఒక్కరూ విరివిగా చెట్లనునాటి పర్యావరణాన్ని కాపాడాలని ఎంపీడీవో వెంకటరంగారావు పిలుపునిచ్చారు. శుక్రవారం మండల పరిధిలోని నిడిగల్లు, నారసింపల్లి గ్రామాలలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో వెంకట రంగారావు డిప్యూటీ ఎంపీడీవో విజయ్ శేఖర్ నాయుడు తదితరులు మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అమ్మ పేరుతో ఒక మొక్క నాటే కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై కాళీ ప్రదేశాలలో విరివిగా మొక్కలు నాటి పర్యావరణాన్ని మరియు ప్రజారోగ్యాన్ని కాపాడుకోవాలని కోరారు. రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి ధర్మవరం శాసనసభ్యులు సత్య కుమార్ యాదవ్ ఆదేశాల మేరకు ధర్మవరం నియోజకవర్గం లోమొత్తం పదివేల మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టడం జరిగిందని అందులో భాగంగా తాడిమర్రి మండలం నిడిగల్లు గ్రామంలో మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో అనిల్ కుమార్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి హేమలత, ఈసీ సాయి కృష్ణా రెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్ భారతి, బిజెపి మండల కన్వీనర్ దేవర రామ్మోహన్, జిల్లా ఎగ్జిక్యూటివ్ నెంబర్ చెంచుగొల్ల రామాంజనేయులు, వైస్ ఎంపీపీ కృష్ణం నాయుడు, కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు గోవిందుగంగులప్ప, మండల అధ్యక్షులు గోనుగుంట్ల వెంకట నాయుడు, మండల ప్రధాన కార్యదర్శి దాసరి రామాంజనేయులు, ఓబీసీ మోర్చా జిల్లా కార్యవర్గ సభ్యులు గంగాధర్ మరియు గ్రామ ప్రజలు ఉపాధి శ్రామికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురికి గాయాలు

-కోనాపురం సమీపంలో 42వ నంబర్ జాతీయ రహదారిపై ఘటన

గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మురళి, గాయపడిన మహాలక్ష్మి, చిన్నారులు సహస్ర, యోగినాథ్, 6 నెలల వయసుగల విఠల్

ఉరవకొండ, జూన్ 5 ప్రభాతవార్త

ద్విచక్ర వాహనం అదుపుతప్పి ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు తీవ్రంగా గాయపడిన ఘటన ఉరవకొండ మండల పరిధిలోని కోనాపురం గ్రామంవద్ద అనంతపురం-బళ్లారి 42వ నంబర్ జాతీయ రహదారిపై శుక్రవారం ఉదయం చోటు చేసుకుంది. బాధితులు, పోలీసుల ద్వారా తెలిసిన మేరకు వివరాల్లోకి వెళితే...ఉరవకొండ పట్టణంలోని డ్రైవర్స్ కాలనీకు చెందిన వెల్డింగ్ వృత్తి ద్వారా జీవనం సాగించే మురళి అనే వ్యక్తి తన భార్య మహాలక్ష్మి, ఐదేళ్ల వయసుగల సహస్ర, నాలుగేళ్ల వయసుగల యోగినాథ్, 6 నెలల వయసుగల విఠల్‌తో కలిసి తన ద్విచక్రవాహనంలో అనంతపురం వెళుతుండగా కోనాపురం గ్రామంవద్దకు చేరుకోగానే వాహనం ఓవర్ లోడ్ కారణంగా అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో ఐదుగురికి తీవ్ర గాయాలు కాగా సమాచారం అందుకున్న 108 వాహనం ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులు ఉరవకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించింది. ఇక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం మురళిను వైద్యుల సూచనల మేరకు మెరుగైన వైద్యం కోసం జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత

-జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి విజయలక్ష్మి

-సెరెంటికా కంపెనీ ఆధ్వర్యంలో వెయ్యి మొక్కలు నాటే కార్యక్రమం

ఉరవకొండ, జూన్ 5 ప్రభాతవార్త

మొక్కలు నాటుతున్న జెడ్పీ సీఈవో విజయలక్ష్మి తదితరులు

పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యత ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి విజయలక్ష్మి పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఉరవకొండ పట్టణంలోని పలు ప్రాంతాల్లో సెరెంటికా కంపెనీ నేతృత్వంలో 1,000 మొక్కలు నాటే కార్యక్రమం జరుగగా ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పట్టణంలోని ప్రధాన రహదారిపై స్థానిక నాయకులతో కలిసి మొక్కలు నాటి నీరు పోసారు.

మొక్కలు నాటుతున్న ఎస్ఐ పి.జనార్ధననాయుడు సిబ్బంది

ఈ సందర్భంగా జెడ్పీ సీఈవో విజయలక్ష్మి మాట్లాడుతూ కరువుకు నిలయమైన అనంతపురం జిల్లాలో మొక్కలు పెంపకం ఎంతో ఎంతో అవసరం అన్నారు. సెరెంటికా కంపెనీ పెద్దఎత్తున మొక్కలు నాటడానికి ముందుకు రావడం అభినందనీయమన్నారు. అనంతరం సెరెంటికా కంపెనీ ప్రతినిధులు స్థానిక పోలీస్ స్టేషన్, మండల ప్రజా పరిషత్ కార్యాలయ పరిసరాల్లో అధికారులు, ప్రజా ప్రతినిధులతో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బి.వి.రవిప్రసాద్, ఎస్ఐ పి.జనార్ధన నాయుడు, సిరెంటికా కంపెనీ ఏపీ అసిస్టెంట్ వైస్ ప్రసిడెంట్, ఆనంద్, సీవోవో బిగియాన్, పీఎంవో హేమానంద్, పీఈ హెడ్ రాజశేఖర్, పీఏసీఎస్ ఛైర్మెన్ ప్యారం కేశవానంద, ఆసుపత్రి హెచ్‌డీఎస్ వైస్ ఛైర్మెన్ యేళ్ల తిమ్మప్ప, ఎంఈవో హెచ్. ఈశ్వరప్ప, ఏపీవో సుజాత తదితరులు పాల్గొన్నారు.

ప్రపంచ పర్యావరణ దినోత్సవం

రొళ్ల జూన్ 5 (ప్రభాత వార్త):

మొక్కలు నాటుతున్న అధికారులు నేతలు

స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణంలో శుక్రవారం ఎంపీపీ సుమ, ఎంపీడీవో శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవంను నిర్వహించారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ గురుమూర్తి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవ ప్రాముఖ్యతను తెలుపుతూ కార్యాలయ ఆవరణంలో మొక్కలు నాటారు. అనంతరం వారు మాట్లాడుతూ..పర్యావరణాన్ని కాపాడే లక్ష్యంతో ఏటా జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. పర్యావరణ సమస్యలు, సవాళ్ల గురించి ప్రజల్లో అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అన్నారు. పర్యావరణం అనేది వాతావరణం, శిలావరణం, జలావరణం, జీవావరణం అనే నాలుగు ప్రధాన భాగాలతో ఏర్పడిందన్నారు. పట్టణాల్లో గ్రామాల ఇంటి ఆవరణలో పరిశుభ్రతను పాటించి ప్రతి మనిషి మొక్కలను దాటాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో సుధాకర్, ఏపీవో ఓబులప్పలతో పాటు టెక్నికల్, ఫీల్డ్ అస్టెంట్ పాల్గొన్నారు.

కళ్యాణదుర్గంలో గంజాయి విక్రేత అరెస్టు

450 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్న పోలీసులు

కళ్యాణదుర్గం టౌన్, జూన్ 5 , ప్రభాత వార్త

గంజాయి విక్రయిస్తున్న యువకుడిని అరెస్ట్ చేసిన పోలీసులు

అనంతపురం జిల్లా ఎస్పీ జగదీష్ ఆదేశాలమేరకు, కళ్యాణదుర్గం డీఎస్పీ రవి బాబు పర్యవేక్షణలో పోలీసులు గంజాయి విక్రయాలపై ప్రత్యేక నిఘా నిర్వహించారు. అందిన సమాచారంతో కళ్యాణదుర్గం పట్టణ సీఐ హరినాథ్ తన సిబ్బందితో కలిసి పట్టణ శివారులోని కంబదూరు రోడ్డులో ఉన్న స్పైస్ అవెన్యూ రెస్టారెంట్ సమీపంలో శుక్రవారం తనిఖీలు చేపట్టి గంజాయి విక్రయిస్తున్న కర్ణాటక రాష్ట్రంలోని వైఎన్‌హెచ్ కోటకుచెందిన ఎరుకలఅన్వేష్ (23) అనే యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. ప్రస్తుతం అతడు కళ్యాణదుర్గం పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో నివాసం ఉంటున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితుడి వద్ద నుంచి 450 గ్రాముల గంజాయిని రెవెన్యూ అధికారుల సమక్షంలో స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. అనంతరం అతడిని అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ, గంజాయి విక్రయం, రవాణా లేదా సేవించడం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు మాదకద్రవ్యాల సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు.

ఇంటికో మహిళా వ్యాపారవేత్తను తయారు చేయటమే ప్రభుత్వ లక్ష్యం

- అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్ రాధారాణి - మన డబ్బులు మన లెక్కలుపై అవగాహన

పామిడి, జూన్ 05 ప్రభాతవార్త

ఇంటికో మహిళా వ్యాపారవేత్తను తయారు చేయటమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకెళ్తోందని అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్ రాధారాణి పేర్కొన్నారు. పట్టణంలోని శ్రీ సరస్వతీ విద్యామందిరం నందు శుక్రవారం ఐకెపి ఏపిఎం నల్లప్ప ఆద్వర్యంలో మన డబ్బులు మన లెక్కలుపై మహిళలకు అవగాహన కల్పించిన అనంతరం అంబేద్కర్ సర్కిల్ వరకూ ర్యాలీ చేపట్టి మానవహారంను నిర్వహించారు. ఈసందర్భంగా అడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్ రాధారాణి మాట్లాడుతూ మహిళా స్వయం సహాయ సంఘాల ఆర్థిక లావాదేవీల్లో మోసాలకు అడ్డుకట్ట వేయటం, మహిళలకు డిజిటల్ సాధికారిత కల్పించటానికి ప్రభుత్వం మన డబ్బులు మన లెక్కలు అనే ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. మహిళా సంఘాల బలోపేతానికి ఉపయోగపడే 'సూపర్ నారీ యాప్'ను సద్వినియోగం చేసుకోవాలని తద్వార ఆర్థిక వ్యవహారాలను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. పొదుపు రుణాల వడ్డీ లెక్కలను డ్వాక్రా సంఘాల సభ్యులు నేరుగా మొబైల్ ద్వార తెలుసుకోవచ్చున్నారు. గ్రూపుల్లో జరిగే నెలవారీ పొదుపులు, బ్యాంకు లింకేజీలు, స్త్రీ నిధి రుణాలు, అంతర్గత పొదుపుల వివరాలను డిజిటల్ రూపంలో భద్రపరుస్తారని తెలియజేశారు. మహిళలను వ్యాపారవేత్తలుగా తయారు చేయటమే ముఖ్యఉద్దేశ్యం అన్నారు.

మాట్లాడుతున్న ఐకెపి ఏపిఎం నల్లప్ప.

హాజరైన డ్వాక్రా గ్రూపుల సభ్యులు.

ఈకార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి రవీంద్రబాబు, స్త్రీ నిధి ఏజీఎం దయాసాగర్, సిఐ శివశంకర్ నాయక్, పి.కొత్తపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మెన్ బొల్లు శ్రీనివాసరెడ్డి, గుత్తి మార్కెట్‌యార్డ్ మాజీ చైర్మెన్ కత్రిమల ప్రభాకర్‌చౌదరీ, నగరపంచాయతీ మాజీ చైర్మెన్ గౌస్‌ఫీర, డ్వాక్రా గ్రూపుల సభ్యులు, ఈ నారీ యానిమేటర్స్, సమాఖ్య అద్యక్షురాలు, అకౌంటెంట్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పర్యావరణ దినోత్సవం

అనంతపురం న్యూటౌన్, జూన్ 5 ప్రభాతవార్త

జూన్ 5 ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని కాలుష్య నియంత్రణ మండలి జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వివిధ అంశాలపై నిర్వహించిన పోటీలలో విజేతలకు బహుమతులు ప్రదానోత్సవం చేశారు. ఇందులో భాగంగా పర్యావ రణ ప్రతిజ్ఞవిబిది అధ్యర్యంలో చెట్లు నాటే కార్యక్రమం జరిగింది. దీనికి అతిథిగా ఆర్ట్స్ కాలేజీ కెమిస్ట్రీ అధ్యాపకుడు ద్వీప కిరణ్ పర్యావరణ పట్ల అవగాహన కల్పించారు. అంతేకాకుండా వివిధ ప్రాంతీయ కోఆర్డినేటర్ ఆనందబాస్కరెడ్డి , కాలుష్య నియంత్రణ మండలి తినిని కేదారనాథ్, అనలిస్ట్ హారిని, సైన్స్ ఆఫీసర్ నరసింహారెడ్డి, సైన్స్ ఉపాధ్యాయులుశైలజ,వసంత, సూరి తదితరులు పాల్గొన్నారు

మొక్కలు నాటి నీటిని పోస్తున్న అధికారులు

మొక్కల సంరక్షణ బాధ్యత మనందరిదీ

- ఎంపిడిఓ భాస్కర్

ర్యాలీ చేస్తున్న దృశ్యం

ఎంపిడిఓ కార్యాలయం ప్రాంగణంలో మొక్కలు నాటుతున్న దృశ్యం

శింగనమల, జూన్ 5 ప్రభాతవార్త

మండల వ్యాప్తంగా అధికారులు, ప్రజలు, యువకులు ఖాళీ స్థలాల్లో మొ క్కలు నాటి, వాటిని సంరక్షించే బాధ్య త కూడా తీసుకోవాలన్నారు. శుక్రవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఎంపిడిఓ భాస్కర్ ఆధ్వర్యంలో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎంపిడిఓ కార్యాలయం ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొక్కలనునాటకపోతే భవిష్యత్తులో ఉష్ణోగ్రతలు పెరిగి ప్రజల జీవన విధానానికి ఇబ్బందిగా తయారవుతోందన్నారు. ప్రతియేటా చాలా మంది మొక్కలు నాటుతున్నారని అయితే వాటి సంరక్షణ బాధ్యత పట్టించు కోవడం లేదన్నారు. కావున మొక్కలు నాటి వదిలేయకుండా ప్రతి ఒక్కరు ఒక మొక్కను సంరక్షించే బాధ్యత తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ నరసింహరాజు, ఏపిఓ భాగ్యలక్ష్మి, ఎంపిడిఓ కార్యాలయ సిబ్బంది, ఏఓ నాగభూషణ్‌రెడ్డి, ప్రతాప్, ఈసి దామోదర్, పంచాయితీ కార్యదర్శి తిప్పేస్వామి, ఉపాధిహామీ సిబ్బంది, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

కదిరి మున్సిపల్ కమిషనర్‌గా పిఅజయ్ కుమార్

కదిరి, జూన్ 5 ప్రభాతవార్త

కదిరి మున్సిపల్ కమిషనర్ పిఅజయ్ కుమార్ (ఫైల్‌ఫోటో)

కదిరి మున్సిపల్ కమిషనర్‌గా పి.అజయ్ కుమార్ నియమిస్తూ ప్రిన్సిపల్ సెక్రెటరీ కృష్ణబాబు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో కదిరి మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తున్న కిరణ్ కుమార్ అవినీతి ఆరోపణ రావడంతో అతని తన మాతృ శాఖకు బదిలీ చేశారు. ఆయన స్థానంలో మున్సిపల్ కార్యాలయంలో ఏఈగా విధులు నిర్వహిస్తున్న సందీప్ ఇన్చార్జి కమిషనర్‌గా విధులు నిర్వహించేవారు. మునిసిపల్ కమిషనర్ బదిలీల్లో భాగంగా సత్య సాయి జిల్లా కేంద్రంలో ఆడిట్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న పి.అజయ్ కుమార్ మున్సిపల్ కమిషనర్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అజయ్ కుమార్ రెండు రోజుల్లో కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టనున్నట్లు సమాచారం.

'మున్సిపల్' కార్మికుల సమస్యల పరిష్కరించండి

-ఎస్సీ మున్సిపల్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్

అనంతపురం జూన్05 ప్రభాతవార్త

అవుట్‌సోర్సింగా విధానంలో పనిచేస్తున్న కార్మికులు మృతి చెంది మూడేళ్లు గడుస్తున్నా, వారి స్థానంలో కుటుంబ సభ్యులకు ఉపాధి కల్పించకపోవడంతో కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులకు గురౌతున్నారని, ఎక్స్‌గ్రేషియో చెల్లింపులపై పలుమార్లు వినతి చేసినా ఫలితంలేదని ఎస్సీ మున్సిపల్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కమిషనర్ ఎం.జస వంతరావుకు వినతి చేసింది. శుక్రవారం కమిషనర్ ఛాంబర్‌లో అసోసియేషన్ అధ్యక్షులు అజయ్ బాబు, గౌరవాధ్యక్షులు తిరుపాల్, వెంకటేష్, ఉపాధ్యక్షులు కె.ఆర్.సురేష్‌బాబు, ట్రెజరర్ ఎం.ఓబులేసులతో కూడిన బృందం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెగ్యులర్ కార్మికులకు ఫిబ్రవరి నెలలో ఇన్‌కమ్ ట్యాక్స్ కోతల కారణంగా పెండింగ్‌లో వున్న నలుగురి ఉద్యోగుల జీతాలు ఇప్పటికి విడుదల కాలేదన్నారు. అలాగే కార్మికులకు సిపిఎస్, ఈఎల్ బిల్లులు పెండింగ్‌లో వున్నాయని, 24 మంది డ్రైవర్లకు గత మూడు నెలలుగా వేతనాలు చెల్లించలేదని, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు గ్రాడ్యుటీ ఇవ్వాల్సి ఉడగా ఇంతవరకు చర్యలు లేవన్నారు. అదేవిధంగా 131 మంది అదనపు కార్మికులకు సంబందించి పిఎఫ్,ఈఎస్ఐ కూడా కట్ చేయని పరిస్థితి నెలకొందని, తక్షణం కమిషనర్ స్పందించి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ వినతి చేసిన వారిలో ఎస్.వెంకటనరసయ్య, బి.సి.చిరం జీవి, జోసెఫ్, కుల్లాయప్ప, లింగమయ్య, రాఘవ, రాయుడు, బాలు, రామాంజి, ఈశ్వరయ్య, రాజమ్మ, రామాంజినమ్మ, నల్లమ్మ, రాములమ్మ, కాటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎస్సీ మున్సిపల్ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలి. అధికారులు.

అనంతపురం రూరల్, జూన్ 05 ప్రభాతవార్త

పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమవంతు పాత్ర పోషిస్తూ పునరాకితం కావాలని డి యల్ పి ఓ విజయ్ కుమార్, పంచాయతీ అభివృద్ధి అధికారి మల్లికార్జున కోరారు. శుక్రవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పంచాయతీ అభివృద్ధి అధికారి మల్లికార్జున గ్రామసభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డి యల్ పి ఓ విజయ్ కుమా ర్ హాజరయ్యారు. వారు పర్యావరణ పరిరక్షణపై గ్రామ ప్రజలతోనూ, పంచా యతి కార్మికులతో ప్రత్యేక ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నియంత్రించాలని, నిత్యజీవితంలో బట్టల సంచులను మాత్రమే ఉపయోగించాలన్నారు .పర్యావరణానికి తీవ్ర నష్టం కలిగిస్తున్న సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను దూరం పెట్టాలని, ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించాలని అధికారులు పిలుపునిచ్చారు. ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా పర్యావరణ పరిరక్షణ ఉద్యమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, ప్రజలు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటుతున్న దృశ్యం.

జానపద కృష్ణవేణికి ప్రశంసల జల్లు

అనంతపురం న్యూటౌన్, జూన్ 5 ప్రభాతవార్త

కృష్ణవేణిని సన్మానిస్తున్న దృశ్యం

గానగాంధర్వులు ఎస్పి బాలు 80వ జయంతి సందర్భంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ తెలుగు రాష్ట్రాలలో గల గాయనీ గాయకులకు పాటల పోటీలను తెలంగాణ రాష్ట్రం భద్రాది కొత్తగూడెం జిల్లా భద్రాచలంలో సినీ పాటలు పోటీలను పోకల శ్రీనివాస్ ఆధ్వ ర్యంలో నిర్వహించి నట్లు ఆటపా ట జానపద కృష్ణవేణి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె పలు విషయాలను ప్రభాతవార్తతో పంచుకున్నారు. నాకు (ఎడ్ల కృష్ణవేణి) మహిళల విభాగం రెండవ బహుమతిని గెలుచుకున్నట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా గాయకులు శ్రీకృష్ణ పాండవీయం చిత్రంలోని చాంగురే బంగారు రాజా అనే పాటను ఆలపించడంతో సభికుల నుంచి ప్రశంసల జల్లు కురిపించినట్లు తెలిపారు. ఈ పోటీలలో 50 మంది గాయని గాయకులు పాల్గొన్నట్లు ఆమె తెలిపారు. న్యాయ న్యాయ నిర్ణేతగా రాజబాబు (ఈటీవీ పాడుతా తీయగా) జీవన్ కుమార్, సరళ దేవి ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించినట్లు తెలిపారు. నా పాట పూర్తిగా వింటే జడ్జి నీ గొంతు జిక్కి లాగా ఉందని ప్రశం సించినట్లు ఆమె తెలిపారు. ఈ బహుమతులను భద్రాచలం స్థానిక ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు చేతుల మీదుగా బాలు ప్రతిమతోపాటు రూ. 10,000/ నగదు అందజేసినట్లు ఆటపట జానపద కృష్ణ వేణి తెలిపారు.

మహిళల భద్రత బాలికల సంరక్షణపై యావత్ సమాజం కలిసికట్టుగా నడవాలి

- సిఐ శివశంకర్‌నాయక్ - మహిళలు బాల బాలకల భద్రతపై అవగాహన

పామిడి, జూన్ 05 ప్రభాతవార్త

మహిళల భద్రత, సంక్షేమం కేవలం ప్రభుత్వం చేపట్టాల్సిన కార్యక్రమం మాత్రమే కాదని యావత్ సమాజం కలిసికట్టుగా ముందుకు నడవాల్సిన అంశం అంటూ విద్య, ఉపాధి, భద్రత వంటి రంగాల్లో మహిళలు సాధిస్తున్న పురోగతికి తగిన రక్షణ కల్పించాల్సిన అవసరం ఎంతైనావుందని సిఐ శివశంకర్‌నాయక్ పేర్కొన్నారు. స్థానిక శ్రీ సరస్వతీ విద్యామందిరంలో శుక్రవారం మహిళలు బాల బాలికల భద్రతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా సిఐ శివశంకర్‌నాయక్ మాట్లాడుతూ మహిళల భద్రత, బాలికల సంరక్షణ బాధ్యత మనందరిపై ఉందన్నారు. శాస్త్ర సాంకేతిక రంగాల్లో దూసుకెళ్తున్న పోటీ ప్రపంచంలో బాల బాలికలు విద్యలో రాణిస్తేనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని తెలిపారు. అత్యున్నత విద్యను అభ్యసించినప్పుడే అన్నిరంగాల్లో అభివృద్ది సాధించగలరని ఈనేపద్యంలో మహిళలు బాలికల కోసం రాజ్యాంగంలో పొందుపరిచిన చట్టాలపై అవగాహన పెంపొందించుకోవాలని తెలియజేశారు. విద్యార్థులు ఆకర్షణ మోజులో పడి బంగారు భవిష్యత్తును దూరం చేసుకుంటున్నారని, మత్తు పదార్థాలు, జూదాలకు దూరంగా ఉంటేనే ఉన్నత శిఖరాలకు చేరుకుంటారని తెలియజేస్తూ తల్లిదండ్రుల వారి ప్రవర్తనపై నిఘా ఉంచాలని, ఏవైనా లింకులు వచ్చినప్పుడు ఓపెన్ చేయరాదని ఓటిపిలు చెప్పవద్దని సూచిస్తూ సైబర్‌క్రైం గురించి క్షుణ్ణంగా వివరిస్తూ స్త్రీ శక్తి యాప్‌ను మొబైల్‌లో ఇన్‌స్టాల్ చేసుకోవాలని ఏవైనా సమస్యలు వచ్చినప్పుడు 100, 181కు డయల్ చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో ఎస్ఐ రాఘవేంద్రప్ప, పి.కొత్తపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మెన్ బొల్లు శ్రీనివాసరెడ్డి, గుత్తి మార్కెట్‌యార్డ్ మాజీ చైర్మెన్ కత్రిమల ప్రభాకర్‌చౌదరీ, నగరపంచాయతీ మాజీ చైర్మెన్ గౌస్‌ఫీర, మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిఐ శివశంకర్‌నాయక్

హాజరైన మహిళలు.

పర్యావరణం పరిరక్షణలో ప్రలందరు భాగస్వామ్యులు కావాలి



పర్యావరణ దినోత్సవం సందర్భంగా సమావేశంలో మాట్లడుతున్న ప్రత్యేక అధికారి సదాశివ

బుక్కరాయసముద్రం జూన్ 5 ప్రభాతవార్త

పర్యవరణ పరిరక్షణలో ప్రజలందరు భాగస్వామ్యులు కావా లని బుక్కరాయసముద్రం ప్రత్యేక అధికారి సదాశివ,పంచా యితీ అభివృద్ది అధికారి టి. పెద్ద శ్రీనివా సులు పిలుపునిచ్చారు.వారి ఆధ్వర్య ంలో శుక్రవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పంచాయితీ కార్యాలయం నందు ప్రత్యేక గ్రామ సభ నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లడుతూ భూమిమీద మానవ మనుగ డకు పర్యావరణం సమతుల్యత ఎంత ప్రాముఖ్యతో వివరించారు.గ్రామ ప్రజలందరు పర్యావరణహిత అలవాట్లు పెంపొందించుకోవాలని కోరారు. ముఖ్యంగా ప్రతి ఒక్కరు సామాజిక బాధ్యతతో మొక్కలు పెంచాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని తడి పొడి చెత్తను వేరు చేసి పారిశుధ్య కార్మికులకు అందించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో వారితోపాటు గ్రామ పంచాయితీ సిబ్బంది,స్వర్ణ గ్రామాల సిబ్బంది,గ్రామ ప్రజలు తదితిరులు పాల్గొన్నారు.

ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయుల టెట్ సంబంధిత సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి

అనంతపురం న్యూటౌన్, జూన్ 5 ప్రభాతవార్త

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న టెట్ సంబంధిత సమస్యలను దృష్టిలో ఉంచుకొని, క్రింది అంశాలపై ప్రభుత్వం దృష్టి సారించేలా మీ వంతు సహకారం అందించాలని వినయపూర్వకంగా కోరుతున్నామని కె.వెంకటరత్నం, జిల్లా అధ్యక్షులు కె.నారాయణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు చల్లా శివానంద, జిల్లా ఉపాధ్యక్షులు జిల్లా నాయకులు మురళీధర్, నాగేంద్ర, కుళ్ళాయప్ప, సూర్యనారాయణలు ఎమ్మెల్సీ భూమి రెడ్డి రామ గోపాల్ రెడ్డిని కోరారు. ఈ సందర్భంగా శుక్రవారం వినతిపత్రం అందజేశారు.

ఇంధన పొదుపు పై అవగాహన సైకిల్ యాత్ర

బుక్కరాయసముద్రం జూన్ 5 ప్రభాతవార్త

సైకిల్ యాత్రలో పాల్గొన్న టిడిపి నాయకులు

బుక్కరాయసముద్రం లోని దేవరకొండ నుంచి అనంతపురం లోని గుత్తి రోడ్డు లోని వాజ్‌పేయ్ సర్కిల్ వరకు సైకిల్ తొక్కి సైకిల్ యాత్ర చేపట్టారు. ఈ కార్యక్రమంలో అనంతపురం జిల్లా తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆర్టీసీ జోనల్ చైర్మెన్ పూల నాగరాజు,ద్విసభ్యకమిటీ సభ్యులు ఆలం నరసా నాయుడు,ఎడిసీసీ బ్యాంకు చైర్మన్ ముంటిమడుగు కేశవరెడ్డి,టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రామలింగారెడ్డి,టిడిపి జిల్లా ప్రదాన కార్యదర్శి శ్రీధర్‌చౌదరి,మాజీ గ్రంథాలయ చైర్మెన్ గౌస్‌మోద్దీన్,టిడిపి నాయకులు రాయల్ మురళి పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆలం నరసా నాయుడు మాట్లడుతూ ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి భాధ్యత అని భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన వాతారణాన్ని అందించాలంటే చెట్ల పెంపకం, ఇందనం పొదుపు ప్రజల్లో అవగాహన కల్పి ంచాలన్నారు.సైకిల్ వినియోగం ద్వారా ఇందన వినియోగం తగ్గించడంతోపాటు ఆరోగ్యంను కాపాడుకొన వచ్చును. ప్రపంచ పర్యవరణ దినోత్సవం సందర్భంగా రాష్ట్రంలో చేపడుతు న్న హరిత కార్యక్రమాలకు ప్రజలు పెద్ద ఎత్తున భాగస్వామ్యం కావాలన్నా రు.ఈ కార్యక్రమంలో వారితోపాటు సొసైటి అధ్యక్షులు కేశన్న,టిడిపి మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ,మాజీ కన్వీనర్ అశోకుమార్,తోపాటు పలువురు నాయకులు కార్యకర్తలు తదితిరులు పాల్గొన్నారు.

ఘనంగా పర్యవరణ దినోత్సవం

అనంతపురం న్యూటౌన్, జూన్ 5 ప్రభాతవార్త

మొక్కలు నాటి నీటిని పోస్తున్న దృశ్యం

ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో పర్యావరణ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చెట్లను నాటి ప్రకృతిని కాపాడాల్సిన అవసరాన్ని ప్రిన్సిపాల్ పద్మశ్రీ, ఎన్‌జిఆర్ఐ శాస్త్రవేత్త ప్రదీప్ కుమార్ నొక్కి చెప్పారు. పర్యావరణాన్ని కాపాడి కాలుష్య రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటి కాలుష్యాన్ని తగ్గించడంలో తమ వంతు పాత్ర పోషించాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల పరిపాలన అధికారి రమణ, ఎకో క్లబ్ కోఆర్డినేటర్ రఘురాములు, ఎన్ఎస్ఎస్ అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా సప్లిమెంటరీ పరీక్షలు

అనంతపురం న్యూటౌన్, జూన్ 5 ప్రభాతవార్త

పదవ తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు మే 2026కు సంబంధించి శుక్రవారం జిల్లాలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్షల నిర్వహణ పకడ్బందీగా నిర్వహించినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాసరావు తెలిపారు. ఇంగ్లీష్ పరీక్షకు గాను జిల్లాలో 34 సెంటర్స్ లలో అభ్యర్థులు ఎస్ఎస్‌సి-1335 మందికి గాను 748-ఎస్ఎస్‌సి మంది హాజరు అయ్యారు. అందులో 587-ఎస్ఎస్‌సి మంది గైర్హాజరు అయ్యారు. హాజరు శాతం 57 నమోదు అయినది 02 ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు 5 సెంటర్లను అనంతపురం జిల్లా విద్యాశాఖాధికారి బి.శ్రీనివాస రావు 01 సెంటర్స్ పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. జిల్లా మొత్తం 06 పరీక్షా కేంద్రాలను పరిశీలించారు. జిల్లాలో ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరిగాయని జిల్లా విద్యాశాఖాధికారి బి.శ్రీనివాస రావు తెలిపారు.

టిడిపితోనే నిరుద్యోగ నిర్మూలన...

అనంతపురం న్యూటౌన్, జూన్ 5 ప్రభాతవార్త



మాట్లాడుతున్న అమర్ యాదవ్

తెలుగుదేశం పార్టీ 1983 నుంచి ఇప్పటివరకు అధికారులు ఉన్నప్పుడు నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు 60 శాతం కల్పించిన ఘనత టిడిపికి దక్కుతుందని టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర మాజీ కార్యదర్శి అమర్ యాదవ్ అన్నారు. విలేకర్లతో అమర్ యాదవ్ మాట్లాడుతూ.. ప్రస్తుతం ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్న వారిలో కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ ప్రభుత్వ ఉద్యోగాలలో టిడిపి అధికారంలో ఉన్నప్పుడు ఇచ్చినవేనని గుర్తు చేశారు. 2004లో రాజశేఖర్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ ఉద్యోగాలు అమ్ముకు న్నారని ఆరోపించారు. 2019లో జగన్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఐదేళ్ల పాటు అహంకారం తలకెక్కి, చట్టాలను చుట్టాలుగా మార్చు చేసుకొని వ్యవస్థను నిర్వీర్యం చేశారన్నారు. ఇప్పటికైనా జగన్ మానసిక మారాలన్నారు.

నాటిన ప్రతి మొక్కను పరిరక్షించాల్సిన బాధ్యత మనంరిది - బిజెపి నేత విష్ణువర్ధన్‌రెడ్డి

కదిరి, జూన్ 5 ప్రభాతవార్త



తల్లిపేరు మీద మొక్కను నాటుతున్న బిజెపి నేత విష్ణువర్ధన్‌రెడ్డి

నాటిన ప్రతి మొక్కను పరిరక్షించాల్సిన బాధ్యత మనందరిదనీ బిజెపి జాతీయ కౌన్సిల్ సభ్యులు విష్ణువర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రపంచ పర్యవరణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన తల్లి పేరుమీద ఒక మొక్క కార్యక్రమానికి మద్దతుగా విష్ణువర్ధన్‌రెడ్డి నివాసంలో ఆ పార్టీ నాయకులతో కలిసి మొక్కను నాటారు. ఈ సందర్భంగా విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. పర్యవరణ పరిరక్షణ కేవలం బాధ్యత కాదని అది భావి తరాలకు మనం అందించే అతి పెద్ద ఆస్థి అన్నారు. ఈ రోజు మనం నాటే ప్రతి ఒక్క భవిష్యత్తు తరాలకు అందించే ఆరోగ్య కరమైన భూమికి గ్యారెంటీ అని పర్యవరణ సమతుల్యతనుకా పాడటానికి, హరితాభివృద్ధికి ప్రతి ఒక్కరు తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. సుస్థిర జీవన విధానాలను అలవర్చుకోవడం ద్వారానే భూమిని కాపాడగలుగుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు రొద్దం ఉత్తంరెడ్డి, బూదిలి సుదర్శన్, ఇంతియాజ్, మైనుద్దీన్, బాబు, ఓబుళరెడ్డి, సాయిలు పాల్గొన్నారు.

ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు ప్రత్యేక టెట్ నిర్వహించి, అర్హత మార్కులు తగ్గించి నోటిఫికేషన్ విడుదల చేయాలి - ఎస్‌టియు నేతలు

అనంతపురం న్యూటౌన్, జూన్ 5 ప్రభాతవార్త



వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎంఎల్‌సి భూమిరెడ్డి రామ గోపాల్ రెడ్డి అనంతపురము వచ్చిన సందర్భంగా ఎస్‌టియు జిల్లా అధ్యక్షుడు నీలూరు రమణా రెడ్డి, జిల్లా నాయకత్వం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు తెలియజేస్తూ.. ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు ప్రత్యేక టెట్ నిర్వహించి, అర్హత మార్కులు తగ్గించి నోటిఫికేషన్ విడుదలకు విద్యాశాఖామాత్యులతో మాట్లాడి త్వరలో నోటిఫికేషన్ విడుదలకు తప్పక కృషి చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నీలూరు రమణా రెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్, రాష్ట్ర మున్సిపల్ ఉపాధ్యాయుల కమిటీ కన్వీనర్ బి.ఫణి భూషణ్, జిల్లా నాయకులు నిట్టూరు చంద్రశేఖర రావు, ఎం.శ్రీనివాసులు, కుళ్ళాయప్ప తదితరులు పాల్గొన్నారు.

విత్తన, పురుగుమందుల చట్టాలకు అనుగుణంగా రైతులకు అమ్మకాలు చేయాలి. జెడిఎ సాలు రెడ్డి. ఇంచార్జ్ ఏ డి ఏ వెంకట్ కుమార్.



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జెడిఎ సాలు రెడ్డి.

అనంతపురం రూరల్, జూన్ 05 ప్రభాతవార్త :

విత్తన అండ్ పురుగుమందుల చట్టాలకు అనుగుణంగా డీలర్లు రైతులకు విత్తనాలు మరియు పురు గుమందులు అమ్మకాలు చేయాలని జెడిఎ సాలు రెడ్డి, ఇంచార్జ్ ఏ డి ఏ వెంకట కుమార్,డీలర్లకుతెలియ జేశారు.శుక్రవారం అనంతపురం డివిజన్ పరిధి లోని ఎరువులు విత్తనాలు మరియు పురుగు మందులు డీలర్లకు ఖరీఫ్ మరియు రబి సీజనలకు ముందు అవగాహన కార్యక్రమం ను ఏ ఓ అండ్ ఇంచార్జ్ ఏ డి ఏ వెంకట కుమార్ అధ్యక్షతన నిర్వహించారు.ఈ అవగాహన కార్యక్రమానికి జిల్లా వ్యవసాయాధికారి సాలు రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై డీలర్లకు పలు సూచనలు సలహాలు తెలియజేస్తూ విత్తన, ఎరువుల, మరియు పురుగుమందుల చట్టం యొక్క ముఖ్య అంశాలను గురించి డీలర్లకు వివరించారు. పై చట్టాలకు అనుగుణంగా రైతులకు విత్తనాలను మరియు పురుగుమందుల అమ్మకాలు జరపాలని లేని పక్షంలో వాటిని ఉల్లంఘించిన డీలర్లపై చర్యలు తీవ్రంగా ఉంటాయన్నారు.ఈ కార్యక్రమానికి డివిజన్ ఇంచార్జ్ ఏ డి ఏ వెంకటకుమార్, ఆరు మండలాలు వ్యవసాయ అధికారు లు, డీలర్లు తదితరులు హాజరయ్యారు.

దుర్గాంజినేయ స్వామి కొండపై అమ్మపేరుతో ఒక చెట్టు

శింగనమల, జూన్ 5 ప్రభాతవార్త

ప్రపంచ పర్యవరణ దినోత్స వం సందర్భంగా మండల కేంద్రంలోని దుర్గాంజినేయ స్వామి కొండపై శుక్రవారం బిజె పి మండల కన్వీనర్ బొమ్మన ఓబిరెడ్డి ఆధ్వర్యంలో అమ్మపే రుతో ఒక చెట్టు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మొక్కలు నాటి పర్యవరణ పరిరక్షణ, పచ్చదనం పెంపొందించి బావి తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించాలన్న సంకల్పంతోనే మొక్కలు నాటినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు మల్లెల శ్రీనివాసులు, ఆంజినేయరెడ్డి, బీజెపి మీడియా సెల్ ప్రసాద్‌లు పాల్గొన్నారు.

అనంతపురం రూరల్ తహసీల్దార్ గా బాధ్యతలు చేపట్టిన ఉదయ్ భాస్కర్.

అనంతపురం రూరల్, జూన్ 05 ప్రభాతవార్త : అనంతపురం రూరల్ మండలం తహసీల్దార్ గా ఉదయ్ భాస్కర్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన కూడేరు మండల తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తాసిల్దారుగా విధులు నిర్వహించడం జరిగింది. ఈయనకు డిప్యూటీ తహసీల్దార్ నుంచి తహసీల్దార్ గా ప్రమోషన్ కల్పించి రూరల్ మండల్ కు బదిలీ చేయడంతో ఈయన శుక్రవారం రూరల్ మండల్ తాసిల్దార్ గా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూరల్ మండలంలోని ప్రజలకు, రైతులకు అందరికీ నిత్యం అందుబాటులో ఉండి నా దృష్టికి వచ్చిన వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.



తహసీల్దార్ గా బాధ్య తలు చేపడుతున్న ఉదయ్ భాస్కర్.

అంగన్వాడీ కార్యకర్తలకు ఎఐపై శిక్షణ

శింగనమల, జూన్ 5 ప్రభాతవార్త

మండల కేంద్రంలోని ఐసిడిఎస్ కార్యాలయంలో శుక్రవారం " ఎఐ " నవచేతన యాప్‌పై అంగన్వాడీ కార్యకర్తలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎఐ ట్రైనర్ రామలింగ, ఐసిడిఎస్ పిడి శశికళ, సిహెచ్‌ఓ గంగాధర్, ఎంపిహెచ్‌ఓ చంద్రశేఖర్‌రెడ్డి, సూపర్‌వైజర్లు కల్పన, నేతాజీ, అంగన్వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

NATIONAL SEEDS CORPORATION LIMITED
(A Government of India Undertaking)
"An ISO 9001:2015 & ISO 14001:2015 Company"
REGIONAL OFFICE, 17-11,Tukaram Gate, Lalaguda,
Secunderabad-500017.(TG) PH: 040 -27731152, 27730635
Mail ID- rm.secunderabad@indiaseeds.com

एन एस सी NSC

SHORT TERM NOTICE INVITING E-TENDER

National Seeds Corporation Limited, Regional office, Secunderabad invite tenders through e-tendering for purchase of Groundnut K-1812 Certified Seeds from reputed seed producers / suppliers. Tender Document can be downloaded from **website https://indiaseeds.enivida.com from 06.06.2026, 16.00 hrs.** The Tender fee is Rs.1180 and for further details visits our website www.indiaseeds.com. Tenders without Tender Fee and EMD will be rejected.

Last Date for submission of online tender is 12.06.2026 till 14.00 hrs and the date of opening technical bid is 12.06.2026 at 14.30 hrs.

If opening date happens to be holiday, the tender will be opened on next working day. If any changes will be placed only on NSC web-site.

No. 1(23)/Mktg /NSC-HYD/2026-27/
Date: 05.06.2026

Regional Manager
National Seeds Corporation
Secunderabad

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియచేయడమేమనగా మునిమడుగు గ్రామం, పెనుగొండ మండలం, శ్రీ సత్యసాయి జిల్లా మా కక్షిదారులయిన మేనేజింగ్ డైరెక్టర్ M/s P.R. Infra Avenue Limited companyకి గల హక్కు అనుభవం గల Converted to Non Agriculture Land ఐటమ్ నెం. 1 మరియు Agriculture Land ఐటమ్ నెం. 2 ను రిజిష్టరు కంపెనీలకు గానీ, రిజిష్టరు ట్రస్టులకు గానీ, రిజిష్టరు సొసైటీలకు గానీ, ఆయకములు గానీ, సుద్దవిక్రయములకు గానీ చేయించదలచినారు. ఆసక్తి ఉన్నవారు గానీ, ఏమైనా ఆక్షేపణలు గానీ ఉన్నచో ఈ క్రింది అడ్రసుకు 7 రోజుల లోపల సంప్రదించవలెనని తెలియచేయుచున్నాము. లేనియెడల ఎటువంటి ఆక్షేపణలు లేవని భావించబడును.

షెడ్యులు

All properties Situated within Revenue Village, Munimadugu of Penukonda Rural Mandal, RD Penukonda Anantapur Dist, now at Sri satyasai Dist.

Conversion Land Survey No: 674/1-0.13, 674/10-0.17, 674/11-0.19, 674/12-0.18, 674/2-0.06, 674/3-0.09, 674/4-0.44, 674/5-0.14, 674/8-0.06, 675-0.32, 678/2-6.43, 679/2-0.12, 679/6-0.24, 680/1-0.13, 680/2-0.14, 680/3-0.15, 681/1-0.09, 681/2-2.3, 687-0.56, 689-4.28, 690/2-1.13, 690/6-0.19, 691-1.87, 692/1-1.68, 696/1-0.68, 696/2-0.72, 698/2-2.33 **Total Acers 24.82.**

Agriculture Land Survey No- 679/3-1.09,680/4-0.14 **Total=1.23** Conversion Land+ Agriculture Land=**26.05 Acers**

P. Guruprasad, Advocate,
D.No. 2/209, 2nd Road, Anantapuramu. Cell: 8008740001

పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

రాజకీయాలకతీతంగా స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలి

రాయదుర్గం,హరిత దుర్గం ప్రేరణతో ముందుకు సాగుదాం ఎమ్మెల్యే కాలవ

రాయదుర్గం జూన్ 5 ప్రభాతవార్త

రాజకీయాలకు అతీతంగా స్వచ్ఛంద సంస్థలు అధికారులు రాయదుర్గం హరిత దుర్గం ప్రేమతో పర్యావరణ పరిరక్షణ కోసం ముందుకు సాగాలని పర్యావరణ పరిరక్షణను ప్రజా ఉద్యమంగా మార్చాలని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. మొక్కల పెంపకం, కాలుష్య నియంత్రణను ప్రతి ఒక్కరు బాధ్యతగా స్వీకరించాలన్నారు. పర్యావరణ పరిరక్షణ దినోత్స వం సందర్భంగా రాయదుర్గం పట్టణంలో శుక్రవారం అధికారులు ప్రజాప్ర తినిధులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణ పట్ల ప్రజల్లో అవగాహన కల్పించేలా సైకిల్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ కోసం ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు దశాబ్దాలుగా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తు న్నప్పటికీ కాలుష్య సమస్య ప్రపంచ దేశాలను తీవ్రంగా ప్రభావితం చేస్తోం దన్నారు. పర్యావరణంపై అవగాహన పెంపొందించడం, పరిశుభ్రతపై ప్రజ ల్లో చైతన్యం తీసుకురావడం, నాణ్యమైన జీవనానికి అవసరమైన అలవా ట్లను పెంపొందించడం ప్రతి ఒక్కరు కర్తవ్యంగా స్వీకరించాలన్నారు. ప్రతి ఒక్కరూ పర్యావరణ సంరక్షణకు కట్టుబడి ఉండే ప్రతిజ్ఞ చేయాలని కోరారు. మొక్కలు నాటడం ఎంత అవసరమో, వాటిని సంరక్షించడం కూడా అంతే ముఖ్య మన్నారు. ప్రతి వ్యక్తి తన ఇంటితో పాటు పరిసరాలు, గ్రామాలు, పట్టణా లను పరిశుభ్రంగా ఉంచినప్పుడే కాలుష్యాన్ని సమర్థవంతంగా తగ్గించగల మన్నారు.

ప్రస్తుతం తాగే నీరు, తినే ఆహారం, పీల్చే గాలి కూడా కాలుష్య ప్రభావా నికి గురవుతున్నాయని ఆందోళన వ్యక్తపరిచారు. ఈ నేపథ్యంలో పర్యావరణ పరిరక్షణపై అందరూ ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి వ్యక్తి కనీసం 10 నుంచి 20 మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలని సూచించారు. ప్రధాని నరేంద్ర మోడీ "తల్లి పేరుతో ఒక మొక్క" అనే నినాదంతో దేశ వ్యాప్తంగా విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారన్నారు. రాష్ట్రం లో ముఖ్యమంత్రి చంద్ర బాబు నా యుడు, ఉప ముఖ్య మం త్రి పవన్ కళ్యాణ్ నాయ కత్వంలో మొక్కల పెంపకం, పర్యావరణ పరి రక్షణ కోసం అనేక కార్యక్ర మాలు అమలు చేస్తున్నారని చెప్పారు. ఈ ఏడాది రాష్ట్ర వ్యాప్తంగా కోటి మొక్కల పెంప కాన్ని లక్ష్యంగా పెట్టుకు ని ప్రభుత్వం విస్తృత కార్యా చరణ చేపడుతోందన్నారు. ప్రతి ఒక్కరూ తమ తల్లి పేరుతో ఒక మొక్క నాటి దాని ని సంరక్షించాలన్నారు. 201419 కాలంలో "రాయ దుర్గం హరిత స్వర్గం" కార్యక్రమం కింద రాయదుర్గం నియోజక వర్గంలో సుమారు 7.50 లక్షల మొక్కలు నాటిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఈ ఏడాది కూడా రాజకీ యాలకు అతీతంగా స్వచ్ఛంద సంస్థలు, అధికారులు, ప్రజల భాగస్వా మ్యం తో భారీ స్థాయిలో మొక్కల పెంపక కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ నెలాఖరు నుంచి జూలై నెలాఖరు వరకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టి పెద్ద ఎత్తున మొక్కలు నాటే ఉద్యమానికి శ్రీకారం చుడుతున్నా మన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు బండి కృష్ణ మూర్తి, క్లస్టరు ఇంఛార్జీలు పోరాళ్ల పురుషోత్తము, ఇనాయత్, మాజీ కౌన్సిలర్లు కడ్డిపూడి మహబూబ్ బాషా, బండి భారతి, పైతోట రామంజి,వేణు,కరెన్న, కొండాపు రం శ్రీనివాసులు, పూజారి శివ ,కెడిమి తిప్పేస్వమి,ఎల్లప్ప, మల్లికార్జున, కావలి రవి తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు, తెలుగుదేశం నాయకులు

తల్లికి వందనం అందరికీ దక్కేనా

నెల 19న సొమ్ములు జమ చేయనున్న ప్రభుత్వం - గత విద్యా సంవత్సరంలో 50 మందికి పైగా అందని వైనం - సాంకేతిక సమస్యలు పరిష్కరించలేకపోతున్న అధికారులు - ఈసారైనా పూర్తిస్థాయిలో అందేనా.?

రొళ్ల జూన్ 5 (ప్రభాత వార్త):

సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా కూటమి ప్రభుత్వం ఖితల్లికి వందనంఖి పేరుతో పథకాన్ని అమలు చేస్తోంది. 1 నుంచి ఇంటర్ వరకూ ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉంటే అంత మందికీ రూ.15 వేలు చొప్పున జమ చేసా మని ఎన్నికల ముందు ప్రచారం చేశారు.ఎన్నికల ఏడాది ఎగ్గొట్టిన సర్కారు గతేడాది నుంచి ఈ సొమ్ములను జమ చేస్తూ వస్తోంది.పాఠశాల నిర్వహణ కోసం రూ.2 వేలు మినహాయించి రూ.13 వేలు తల్లి ఖాతాల్లో జమ చేస్తు న్నారు.గతేడాది అనేక మందికి ఈ పథకం అమలు కాలేదు.వివిధ కారణాల తో అర్హత ఉన్నప్పటికీ తల్లికి వందనం 50 మందికి అందని పరిస్థితి ఏర్ప డింది. దీంతో అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేసినా ఫలితం లేకుండా పోయి ంది. ఈసారైనా పూర్తిస్థాయిలో లబ్ధిదారులకు జమ అవుతుందా..? లేదా..? అనేది సర్వత్రా చర్చ నడుస్తుంది. గత ప్రభుత్వ హయాంలో అమ్మ ఒడి పేరుతో ఈ పథకాన్ని అమలు చేసి పాఠశాలలు తెరిచిన రోజునే అనేక మంది లబ్దిదారులకు జమ చేసేవారు.

ఈ నెల 12న పాఠశాలలు పునః ప్రార ంభం కానున్నాయి.అదే లేదా అనే అనుమానాలు రోజు నుంచి తల్లికి వందనం జమ చేసే పరిస్థితి కనిపించడం లేదు. అర్హుల వివరాలను క్షేత్రస్థా యిలో పరిశీలించే కార్యక్రమం ఇంకా కొనసాగుతుండటంతో ఈనెల 19న వేసే అవ కాశం కనిపిస్తోంది.నిబంధ నలతో భారీగా కోకుటుంబ ఆదాయం గ్రా మాల్లో నెలకు రూ.10 వేలు, పట్టణా ల్లో రూ.12 వేల లోపు ఉండాలి. రైస్ కార్డు ఉండాలి.ట్యాక్సీ, ట్రాక్టర్, ఆటో సహా ఎలాంటి ఫోర్ వీలర్స్ ఉండ కూ డదు. ఫ్యామిలీకి 3 ఎకరా ల్లోపు మా గాణి, లేదా 10 ఎకరా ల్లోపు పొడి భూమి, లేదా రెండూ కలిపి 10 ఎకరాల్లోపు ఉండా లి. మున్సిపాలిటీ పరి ధిలో అనగా పట్టణ ప్రాంతాలలో 1000 చదరపు అడుగుల విస్తీర్ణం కలిగిన ప్రాపర్టీ ఉండ కూ డదు. కరెంట్ బిల్ నెలకు 300 యూనిట్లు దాట కూడదు. విద్యార్థుల హాజరు కచ్చితంగా 75 శాతం హాజరు ఉండాలి. కుటుంబంలో ఎవరూ ప్రభుత్వ రిటైర్డ్ పెన్షన్లను గానీ,ప్ర భుత్వ ఉద్యోగి ఉండకూడదు అంటూ అనేక రకాల షరతులు పెట్టారు. దీంతో అనేక మంది అనర్హత జాబితాలోకి చేరారు.ఇలా పలు నిబం ధనలతో గత ఏడాది మండల వ్యాప్తంగా సుమారు 50 మందికి పైనే తల్లికి వందనం పథకం అమలు కాలేదు.వీరిలో అనేక మందికి అర్హత ఉండ దంతో అధికారుల చుట్టూ పలుమార్లు ప్రదక్షిణలు చేసినప్పటికీ ఫలితం లేకుండా పో యింది. సమస్య పరిష్కారం కాకపోవడంతో ఈ సాంకేతిక పథకానికి దూర మయ్యారు. సమస్యలను సాగుగా చూపినా వాటిని సరి చేయలేక పోయారు. ఈసారైనా ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం విద్యార్థుల సంఖ్యకు అనుగుణం గా అందరికీ తల్లికి వందనం సకాలంలో జమ చేయాలని, నిబంధనలను సడలించాలని పలువురు కోరుతున్నారు.

ప్రజల భాగస్వామ్యంతో పనులు పూర్తి చేయాలి.. జిల్లా కలెక్టర్

డి.హిరెహాళ్ జూన్ 5 ప్రభాతవార్త

ప్రజల భాగస్వామ్యంతో పనులు పూర్తి చేయాలని అప్పుడే అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయడం సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ ఓ ఆనంద్ ఐఏఎస్ సూచించారు. శుక్రవారం డి.హిరె హాళ్ మండలం హులికల్లు పరిధిలోని జగ్గమ్మ కుంట చెరు వును జిల్లా కలెక్టర్ చిన్న నీటిపారుదల శాఖ డిఈ గీతాలక్ష్మి, తహసి ల్దార్ సాకే శ్రీనివాసులు, ఎంపీడీవో దాస్ నాయక్ లతో కలిసి పరిశీలించారు. ఈ చెరువు అభివృద్ధి పనులకు ఉపాధి హామీ పథక ం ద్వారా రూ. 26 లక్షల నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో చెరువు కట్ట పటిష్టం, మరువ మరమ్మత్తులు, చెరువు పై భాగంలో ఇరువైపులా ట్రెంచ్ కొట్టడం, జంగిల్ క్లియర్ చేయడం లాంటి అభివృ ద్ధి పనులు జరుగుతున్నాయి. ఈ సందర్భంగ జిల్లా కలెక్టర్ జరుగు తున్న పనుల నాణ్యతను తదితర అంశాలను పరిశీలించి పను ల వేగవంతం చేయాలని అధికారులకు పలు సూచనలు చేశారు. పనులను ప్రజలు, రైతుల భాగస్వా మ్యంతో జరిగేలా చర్యలు తీసుకోవాలని పనుల్లో ఎలాంటి అవకతవకలకు తావివ్వరాదని పనుల్లో పటిష్టమైన నాణ్యతను పాటించాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రజల భాగస్వామ్యంతో చెరువుకు నీరు అందించే పరివాహక ప్రాంతాలైన వంకలు, వాగులు, కాలు వలను బాగు చేసుకోవాలని అప్పుడే వర్షపు నీరు నేరుగా చెరువుకు చేరుతా యని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా మార్కె ట్ యార్డ్ చైర్మన్ ఉండాల హనుమంతరెడ్డి రైతులకు సంబంధించిన పలు అంశాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి మా రైతులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. రాయదుర్గం మండలం మల్లాపురం చెరువు వర్షపు నీటితో నిండిన అనంతరం ఆ చెరువు నుండి పారే వరద నీరు హులికల్లు చెరువుకు చేరుతా యని అలా ప్రవహించే వరద నీరు ఎక్కడికక్కడే వంకలు, వాగులకు వెళ్ళిపోతున్నాయని ఆ కాలువకు మరమ్మత్తులు చేయించాలని ఆయన జిల్లా కలెక్టర్ ను కోరారు. ఆ కాలువ ద్వారా వరద నీరు నేరుగా హులికల్లు చెరు వుకు చేరితే ఆ చెరువు నుండి పారే వరద నీరు మురడి, దొడగట్ట చెరువులకు వరద నీరు చేరుతుందని దీంతో వందల ఎకరాలు సాగులోకి వచ్చి వ్యవసాయ బోర్లలో భూగర్భ జలాలు పెరుగుతాయని ఆయన కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. హులికల్లు, మురడి, దొడగట్ట చెరువులకు వెళ్లే మల్లాపురం, బాదనహాళ్ కాలువలకు మరమ్మత్తులు చేయించేందుకు రూ. 15 లక్షల దాక వెచ్చించాల్సి ఉంటుందని నిధులు మంజూరుచేస్తే ఈ సప్లై చాన ళ్ళకు వరమ్మతులు చేయించుకుంటామని ఆయన కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. హులికల్లు చెరువు మరమ్మత్తులు పూర్తయితే 98 ఎకరాల ఆయకట్టుకు సాగు నీరు అందిస్తూ కళ్యం, హులికల్లు, కదలూరు గ్రామాల పరిధిలో బోర్లలో భూగర్భ జలాలు పెంపొందుతాయని తెదేపా నాయకుడు తిప్పేస్వామి తెలిపారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో రఘు, పంచాయతీ కార్యదర్శి రాజు, ఉపాధి హామీ ఇంచార్జ్ ఏపీవో రామ కృష్ణ, ఆయా గ్రామాల ప్రజలు, రైతులు పాల్గొన్నారు.

చెరువు పనులను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

జిల్లా కలెక్టర్ తో మాట్లాడుతున్న మార్కెట్ యార్డ్ చైర్మన్

ప్రజా సమస్యలను నిర్లక్ష్యం చేయవద్దు - ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి

పుట్టపర్తి టౌన్, జూన్ 05, ప్రభాతవార్త

ప్రజల సమస్యల పరిష్కారమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రజలే మనకు దేవుళ్లని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి అధికారులకు సూచించారు. పుట్టపర్తి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం నిర్వహి ంచిన ప్రజా గ్రీవెన్స్‌లో ఎమ్మెల్యే ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి వారి సమస్యలను ప్రత్యేకంగా అడిగి తెలుసుకున్నారు. నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు భూ సమస్యలు, పింఛన్లు, గృహా లు, తాగునీ రు, రహదారులు, విద్యుత్, సంక్షేమ పథకాల అమలు తదితర అం శాలపై సుమారు 26 మంది ఎమ్మెల్యేకు వినతిపత్రాలు అందజేశారు. ప్రతి సమస్యను ఓపికగా విన్న ఎమ్మెల్యే సంబంధిత శాఖల అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశి ంచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ, ప్రజా సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవ హరించాలని సూచించారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు సకాలంలో అందేలా చూడాల ని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ఫలాలు చేరేలా కృషి చేయాలని తెలి పారు. ప్రజల సమస్యల పరి ష్కారానికి తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, ప్రజలకు మెరుగైన సేవలు అంది ంచడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతి నిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే మాజీమంత్రి

ప్రతి సమస్యను పరిష్కరించండి ఎమ్మెల్యే కాలువ

రాయదుర్గం జూన్ 5 ప్రభాతవార్త

ప్రజలు,రైతుల నుండి వచ్చిన ప్రతి సమస్యను పరిష్కరించాలని ఏమ్మెల్యే కాల్వ శ్రీనివాసులు కలెక్టర్ ను అధికారులను కోరారు శుక్రవారం రాయదుర్గం మండలం 74ఉదేగోళం గ్రామంలో నిర్వహించిన "ఒక నెల – ఒక నియోజక వర్గం, నాలుగు సందర్శనలు" కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్‌తో కలిసి ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలతో నేరుగా మమేకమై వారి సమస్యలు, వినతులను తెలుసుకుని అర్జీలను స్వీకరించారు. ప్రజలు అందించిన ప్రతి అర్జీని సంబంధిత శాఖల అధికారులతో పరిశీలించి, సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసు కోవాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ సేవలను ప్రజలకు మరింత చేరువ చేయడం, గ్రామస్థాయిలో సమస్యలను గుర్తించి త్వరి తగతిన పరిష్కరి ంచడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని ఎమ్మెల్యే కాలవ శ్రీనివా సులు తెలిపారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన పేర్కొన్నారు.

ప్రజల నుండి అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే కాలవ కలెక్టర్ ఓ ఆనంద్

ఇద్దరు, ముగ్గురు పిల్లల్ని కనమని చెప్పడమే చంద్రబాబు సంపద సృష్టి..!

- పోలీసులను అడ్డుపెట్టుకొని అరాచక పాలన సాగిస్తున్న చంద్రబాబు - హామీలేమయ్యాయని ప్రశ్నిస్తే అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపుతున్నారు - మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇంచార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి ధ్వజం - విడపనకల్లులో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో 'చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు' - భారీ ప్రదర్శన, ప్రధాన రహదారిపై మేనిఫెస్టో ప్రతులు కాల్చి నిరసన

ఉరవకొండ, జూన్ 5 ప్రభాతవార్త

తన అనుభవాన్నంతా ఉపయోగించి సంపద సృష్టించి ప్రజలకు పంచు తానన్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేడు బేల మాటలు మాట్లాడుతూ ఒక్కొక్కరు ఇద్దరు ముగ్గురు పిల్లల్ని కనం డని ప్రజలకు పిలునిస్తున్నారని బహుశ చంద్రబాబు చెప్పిన సంపద పిల్లల్ని కనడమేనోనని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇంచార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి విమర్శించారు. వైఎస్సా ర్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహ న్‌రెడ్డి పిలుపు మేరకు వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో శుక్రవారం ఉరవకొండ నియోజ కవర్గం లోని విడపనకల్లు మండల కేంద్రంలో 'చంద్రబాబు వెన్ను పోటుకు రెండేళ్లు' కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక కరక ముక్కల క్రాస్ రోడ్డు నుండి వై.విశ్వేశ్వరరెడ్డి ఆధ్వరంలో పార్టీ నాయకు లు, కార్యకర్తలు ప్లకార్డులు ప్రదర్శి స్తూ చంద్రబాబుకు వ్యతిరేకంగా నినాదా లు చేస్తూ భారీ ప్రదర్శన నిర్వహి ంచారు. స్థానిక దివంగత వైఎస్సా ర్ విగ్రహం కూడలికి చేరుకొని జాతీయ రహదారిపై చంద్రబాబు మేనిఫెస్టో ప్రతులను దగ్ధం చేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వ రరెడ్డి మాట్లా డుతూ గడిచిన రెండు సంవత్సరాల కాలంలోనే చంద్రబాబు నమ్మి ఓట్లు వేసిన ప్రజలను వంచించి వెన్నుపోటు పొడిచారన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల ఏమయ్యాయని ఎవరైనా అడిగితే ప్రతిపక్ష వైఎస్సార్‌సీపీ నాయకులు, చివరి కి జర్నలిస్టులను సైతం టార్గెట్ చేస్తూ వారిపై అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపి వేధిస్తున్నారన్నారు. చంద్రబాబు పోలీసులను అడ్డుపెట్టుకొని నియంతృత్వ పాలన సాగిస్తున్నారని మండి పడ్డా రు. మెగా డీఎస్సీలో అనేక అక్రమాలు వెగులు చూస్తున్నాయని అర్హుల కు తీరని అన్యాయం జరిగిందని, టీచర్ ఉద్యో గాలను మధ్యవర్తుల ద్వారా కొందరు లక్షలకు అమ్ముకున్నారని ఆరోపి ంచా రు. రాష్ట్రంలో రైతులు పండి ంచిన పంటలకు గిట్టుబాటు ధరలేక రైతు లు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలకు నెలకు ఇస్తా మని 1,500 రూపాయల సాయం, నిరుద్యోగ భృతి 3,000 రూపా యలు ఊసే లేకుండా పోయిందన్నారు. సూపర్ సిక్స్ పథకాల అమ లులో ఎన్నో లోటుపాట్లు ఉన్నాయని ఉచిత గ్యాస్ సిలెండర్ల పంపిణీ ఉత్తిదేనని సిలెండర్లు తీసుకున్న వారికి రాయితీ సొమ్ము ఖాతాల్లో సక్రమంగా జమ కావ డం లేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కరణం పుష్పా వతి, పార్టీ జోనల్ అధికార ప్రతి నిధి కె.వి.రమణ, జిల్లా అధికార ప్రతినిధి ఎం.అశోక్ కుమార్, పార్టీ నాయ కులు కరణం భీమరెడ్డి, హావళిగి భరత్‌రెడ్డి, సుంకన్న, గిరిబాబు, బద్రీనాథ్, నాగేంద్ర, సిద్దార్థరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో 'చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు' కార్యక్రమం ప్రదర్శన

మేనిఫెస్టో ప్రతులను దగ్ధం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి తదితరులు

పర్యావరణ పరిరక్షణ సామాజిక బాధ్యత - ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

కదిరి, జూన్ 5 ప్రభాతవార్త

సమాజంలో ప్రతి ఒక్కరు పర్యావరణ పరిరక్షణ సామాజిక బాధ్యతగా గుర్తించాలని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం పట్టణంలోని తన నివాసం నుంచి అడపాల వీధి మునిసిపల్ హై స్కూల్ వరకు సైకిల్ తొక్కుతూ పర్యావరణ పై చైతన్యం కలిగించారు.

పాఠశాల ఆవరణలో వివిధ శాఖల అధికారులు టిడిపి నాయ కులు మాజీ మున్సిపల్ కౌన్సిలర్‌తో కలిసి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ మొక్కలు నాటారు. ఈ సంద ర్భంగా ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ మాట్లాడుతూ సమా జంలో ప్రతి ఒక్కరూ పర్యా వరణ పరిరక్షణ కోసం ముందుకు రావాలని పిలుపుని చ్చారు. వారంలో ఒక రోజైనా ఇంధన వాహనాలు పక్క నపెట్టి ఇంధన పొదుపు పర్యావరణ కోసం కృషి చేయాలి అన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపుమేరకు ఇప్పటికే ఇంధన పొదుపు కార్యక్ర మాలు చేపట్టడం జరిగిందన్నారు. ప్రతి ఏడాది ఉష్ణోగ్రతలు పెరుగుతు న్నాయని అలాంటి తగ్గాలంటే చెట్లు పెద్ద ఎత్తున పెం చాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా వాతావరణంలో కార్బన్డ యాక్సై డ్ తగ్గి ఆక్సిజన్ పెరగాలని దీనిపై పెద్ద ఎత్తున మొక్కలు నాటాల అన్నది ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఇకనుంచి మున్సిపల్ కార్యాల యంలో లేఅవుట్ అప్రూవల్ కోసం చేసే సమయం లో ఎన్ని ప్లాట్ ఉంటే అన్ని చెట్లు నాటే విధంగా, ఇంటి నిర్మాణ లకు అప్రూవల్ ఇచ్చే సమయంలోనే మొక్కలు నాటే విధంగా మున్సిపల్ ప్రణాళిక అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. విరివిగా మొక్కలు నాటి వాటిని పరిరక్షణ కోసం బాధ్యత మన అందరిదని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర నాయకులు పవన్ కుమార్ రెడ్డి, పట్టణ అధ్య క్షుడు డైమండ్ ఇర్ఫాన్, స్వచ్ఛ్ ఆంధ్ర మిషన్ రాష్ట్ర డైరెక్టర్ పర్వీన్ భాను, ఇంచార్జ్ మున్సిపల్ కమిషనర్, సందీప్, మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు, టిడిపి నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఇందన పొదుపులో భాగంగా సైకిల్‌పై పర్యటిస్తున్న ఎమ్మెల్యే

మున్సిపల్ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్

డ్రైనేజీ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యాచరణ చేపడుతున్నాం

- మంత్రి సత్యకుమార్ యాదవ్

ధర్మవరం, జూన్ 05, ప్రభాతవార్త

ధర్మవరంలోని మారుతి నగర్ లో రూ.17.86 లక్షల వ్యయంతో చేపట్టిన సి.సి.రోడ్డు,డ్రైనేజి పనులను రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... గతంలో ఎక్కడ చూసినా చెత్త పేరుకుపోయిన ధర్మవరాన్ని , హరితమైన ధర్మవరంగా మార్చేందుకు అనేక అభివృద్ధి కార్యక్రమాలను ప్రభుత్వం చేపడుతోందని తెలిపారు. ధర్మవరం పట్టణంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని, ప్రజల అవసరాలకు అనుగుణంగా దశలవారీగా పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో దాదాపు రూ.1.25 కోట్ల వ్యయంతో వివిధ ప్రాంతాల్లో ప్రాధాన్యత క్రమంలో డ్రైన్ల నిర్మాణ పనులు చేపడుతున్నామని తెలిపారు. ఇప్పటికే రామనగర్, సాయినగర్, మారుతీనగర్, దుర్గానగర్ వంటి ప్రాంతాల్లో డ్రైన్ నిర్మాణ పను లు చేపట్టామని, కొన్ని ప్రాంతాల్లో సిమెంట్ రోడ్ల నిర్మాణం కూడా చేపట్టి దశాబ్దాలుగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు.కదిరి గేట్ రైల్వే ఓవర్ బ్రిడ్జ్ పనులపై మాట్లాడు తూ... భూసేకరణ పరిహారం సమస్యల కారణంగా పనులు ఆలస్యమైనప్ప టికీ వాటిని పరిష్కరిం చేందుకు ప్రత్యేక చర్యలు తీసుకున్నామని తెలిపారు. పరిహారాన్ని రూ.20 కోట్ల నుండి రూ. 32.60 కోట్లకు పెంచడం ద్వారా అదనంగా రూ.12.60 కోట్ల పరిహారం అందించేలా చర్యలు చేపట్టామని వివరించారు. ప్రస్తుతం పనులు వేగంగా జరుగుతున్నాయని, త్వరలో నే కదిరి గేట్ రైల్వే ఓవర్ బ్రిడ్జ్ ఆర్.ఓ.బి పూర్తి చేసి ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం అందిస్తామని తెలిపారు. రాబోయే రోజుల్లో ధర్మవరం చెరువును సుందరీకరించే ప్రణాళిక లు కూడా ఉన్నాయని, ప్రజలు కుటుంబాలతో కలిసి సాయంత్రం వేళల్లో ప్రశాంతంగా గడిపేలా అభివృద్ధి చేయా లని లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు. దీనికి కేంద్ర ప్రభుత్వ సహకారం కూడా తీసుకునే దిశగా చర్యలు కొనసాగు తున్నాయని పేర్కొన్నారు.

భూమి పూజలు చేస్తున్న మంత్రి సత్య కుమార్

చిన్నూరు బత్తలపల్లి గ్రామం తెగిన చెరువు వృధాగా పోతున్న వర్షపు నీళ్లు

లక్ష్యంతో పనిచేస్తే కరువు ప్రభావాన్ని గణనీయంగా తగ్గించవచ్చు..!..పాడైపోయిన చెక్‌డ్యాములు.. వృథాగా పారుతున్న వర్షపు నీరు..ముళ్లపొదల మయం.. దెబ్బతింటున్న చెరువు కట్ట - మొద్దు నిద్రలో నీటిపారుదల శాఖ అధికారులు?

ధర్మవరం రూరల్ జూన్ 5 ప్రభాతవార్త

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కరువు ప్రాంతంలో కొత్త నీటి వనరులు సృష్టించడం కంటే, కురిసే వర్షపు నీటిని చెరువులు, చెక్‌డ్యాములు, ఇంకుడు గుంతలు, ఫార్మ్ పాండ్ల ద్వారా నిల్వ చేయడం అత్యంత సమర్థ వంతమైన మార్గం. "కురిసిన ప్రతి చుక్క – భూగర్భంలోకి, చెరువుల్లోకి" అనే లక్ష్య ంతో పనిచేస్తే కరువు ప్రభావాన్ని గణనీయంగా తగ్గించవచ్చు. ధర్మవరం మండలంలోని పలు చెరువులు నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. చెరువుల కట్టలపై, చెరువు పరిసర ప్రాంతాల్లో విస్తార ంగా ముళ్లపొదలు పెరిగి పోవడంతో కట్టల భద్రతకు ముప్పు వాటిల్లుతోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు చెరువుల అడుగుభాగం లోనూ ముళ్లపొదలు పెరిగిపోవడంతో నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోతుందని చెబుతు న్నారు. వర్షాకాలం ప్రారంభమైనప్పటికీ చెరువుల సంరక్షణ, మరమ్మ తులపై సంబంధిత అధికారులు దృష్టి సారించకపోవడం విమర్శలకు తావి స్తోంది. చెరువు కట్టలపై పెరిగిన ముళ్లపొదల వేర్లు మట్టిని బలహీనపరచే ప్రమాదం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. భారీ వర్షాలు కురిసిన సందర్భంలో కట్టలు దెబ్బతినే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు...

దెబ్బ తిన్న చెక్‌డ్యా ములుమండలంలోని పలు చెక్‌డ్యాములు కూడా శిథిలావస్థకు చేరుకున్నాయి. మరమ్మతులు లేకపోవడంతో వర్షపు నీటిని నిల్వ చేయాల్సిన నిర్మాణాలు ప్రస్తుతం ఉపయోగం లేకుండా పోయాయి. దీంతో ఇటీవల కురిసిన వర్షా లకు వచ్చిన నీరు నిల్వ కాకుండా నేరుగా లోతట్టు ప్రాంతాలకు ప్రవహి స్తున్నట్లు రైతులు చెబుతున్నారు. చెక్‌డ్యాము లు సక్రమంగా ఉంటే భూగర్భ జలాల మట్టం పెరగడంతో పాటు సాగునీటి అవసరాలకు ఉపయోగపడేదని, ప్రస్తుతం ఆ అవకాశం కోల్పోతు న్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నా రు... రైతుల ఆందోళచెరువుల్లో పేరుకుపో యిన ముళ్లపొద లను తొలగించి, కట్టలను బలోపేతం చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. అలాగే దెబ్బతిన్న చెక్‌డ్యాములకు తక్షణ మరమ్మతులు చేపట్టి వర్షపు నీటిని నిల్వ చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. అధికారులు క్షేత్రస్థాయి లో పరిశీలన నిర్వహించి సమస్యల పరిష్కారానికి ప్రణాళిక రూపొంది ంచాలని విజ్ఞప్తి చేస్తున్నారు... స్పందిం చని అధికారులు చెరువుల సంరక్షణ, చెక్‌డ్యా ముల మరమ్మతుల విషయం లో నీటిపారుదల శాఖ అధికా రులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణ లు వినిపిస్తున్నా యి. వర్షా కా లానికి ముందే చేపట్టాల్సిన పనులు ఇప్పటికీ ప్రారంభం కాకపోవడంతో ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. సమస్యలు మరింత తీవ్రమయ్యేలోపు అధికారులు మేల్కొని చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

చెరువులో పెరిగిన ముళ్ళపొదలు పెరగడంతో ప్రమాదస్థాయిలో చెరువు కట్ట

వైసీపీలో అంతర్యుద్ధం మొదలైందా..?

(మొదటి పేజీ తరువాయి) చంద్రబాబునాయుడు విఫలం ఆయ్యారని, పాలకులు కేవలం ప్రచార ఆర్భాటాలతో ప్రజలను మభ్యపెడుతూ తమ పబ్బం గడుపుకుంటున్నారని మండిపడ్డారు. యువతకు ఉద్యోగాలు, నిరు ద్యోగ భృతి ఇవ్వలేదని, ఆడబిడ్డ నిధి రూ.1500 అమలుకు నోచుకోలే దని, విద్యార్థులకు ఫీజురీయంబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకపోవటంతో కళాశాల ల యాజమాన్యాలు వారికి సర్టిఫికెట్స్ ఇవ్వకుండా ఇబ్బందకులు గురి చేస్తు న్నాయని, మహిళలకు రైతులకు సున్నా వడ్డీ రుణాలు ఎక్కడని ప్రశ్నిం చారు. దాచుకోవటం దోచుకోవటం సిద్ధాంతంతో ముందుకెళ్తున్న కూటమి పాలకులకు ప్రజాక్షేత్రంలో తగిన మూల్యం చెల్లిచుకోక తప్పదని నైరుతీరెడ్డి హెచ్చరించారు.

మీడియాను నెట్టేసిన వైసీపీ సోషల్ మీడియా : టిడిపి మేనిఫెస్టో, ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి పేర్లతో ఇచ్చన హామీల బాండ్లను దహనం చేస్తున్న కార్యక్రమాన్ని కవరేజ్ చేస్తున్న ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులను వైసీపీ సోషల్ మీడియా కార్యకర్త నెట్టివేయటంతో అక్కడ కొద్దిసేపు గందరగోళ పరిస్థితి నెలకొంది. ఫలితంగా జర్నలిస్టులకు వైసీపీ సోషల్ మీడియా కార్యకర్తల మద్య మాటల యుద్ధం కొనసాగింది. దీంతో ఈ కార్యక్రమాన్ని కమరేజ్ చేయమని మీరు సోషల్ మీడియాలోనే ప్రచారం చేసుకోండంటూ జర్నలిస్టులు అక్కడి నుండి వెనుదిరగటం నైరుతీరెడ్డి, చెన్నకేశవరెడ్డి, దిలీఫ్‌రెడ్డిలు జర్నలిస్టులకు సర్దిచెబుతూ ఆపార్టీ సోషల్ మీడియా కార్యకర్తతో క్షమాపణ చెప్పించటంతో సమస్య సద్దుమనిగింది.

వైఎస్ఆర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న నైరుతీరెడ్డి

మేనిఫెస్టో బాండ్లను దహనం చేస్తున్న దృశ్యం.